ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ఏలూరు
జిల్లా వార్తలు
5
గురువారం 19 జూన్ 2025



ముదినేపల్లి మండలం పెయ్యేరు ప్రాథమిక పాఠశాల వద్దకు వచ్చిన తల్లికి వందనం అందుకోని విద్యార్థుల కుటుంబం

జగన్ రీసర్వే.. మాయాజాలం!



అధికారుల బాధ్యతారాహిత్యం.. గత వైసీపీ పాలకుల అలసత్వం వెరసి.. నిరుపేదల కుటుంబాలను ప్రభుత్వ పథకాలకు దూరం చేసింది. జగన్ సర్కార్ హయాంలో చేపట్టిన భూముల రీ సర్వే పేదల పాలిట శాపంగా మారింది. నిరుపేదలను భూస్వాములుగా చూపడంతో ప్రస్తుతం వారి పిల్లలు తల్లికి వందనం పథకానికి దూరమయ్యారు. ఇప్పుడు వీరంతా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

- సెంటు భూమి లేకున్నా భూస్వాములను చేసేశారు
- వ్యవసాయ కూలి పేరిట 118 ఎకరాలు.. వడ్రంగికి 46 ఎకరాలు
- గత ప్రభుత్వ హయాంలో విచిత్రాలు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

తప్పుల సర్వే ఫలితం.. తల్లికి వందనానికి శాపం

మండవల్లి/ముదినేపల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం రైతుల భూముల రీసర్వేకు నిర్ణయించి హైదరాబాద్‌కు చెందిన సర్వే ఆఫ్ ఇండియా సంస్థకు కాంట్రాక్టు ఇచ్చింది. ఆ సంస్థ సిబ్బంది డ్రోన్ల ద్వారా భూమి సర్వే చేసి రికార్డుల్లో రైతుల భూవివరాలు నమోదు చేశారు. డ్రోన్ సర్వే అనంతరం సర్వేచేసిన భూమి మీద వాస్తవ పరిస్థితులు, ఎవరి ఆధీనంలో ఉంది ? ఎవరు భూ యజమానులు, ఎవరు హక్కుదారులు ? అని నిర్ధారించుకోవాల్సి ఉంది. గ్రామసభ ద్వారా ఆ భూములు వివరాలు రైతులకు యజమానులకు తెలిపి ఫారం 54 ద్వారా యజమానుల నుంచి ఒప్పంద పత్రం తీసుకోవాలి. అధికారులు అవేవి చేయకుండా నిరుపేదల జీవితాలతో చెలగాటమాడారు.



- మండవల్లికి చెందిన షేక్ బాజీ తన తాత, తల్లిదండ్రుల కాలం నుంచి పంట కాలువ పక్కన ఇరిగేషన్ పోరంబోకు స్థలంలో చిన్న తాటాకిల్లు వేసుకొని కూలి పనులు, ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. రోజూ పనికి వెళ్లందే ఇంట్లో పొయ్యి వెలగని పరిస్థితి కుటుంబానిది. కానీ సర్వే నంబర్ 948లో 118 ఎకరాలు ఉన్నట్టు ఆన్‌లైన్‌లో చూపడంతో అతను అవాక్కయ్యాడు. తన కుమార్తె షేక్ నాజీయా చదువుకు ఆటంకం కలగకుండా చూడాలని ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నాడు.



- మండవల్లికి చెందిన వల్లూరి ప్రసాద్ వడ్రంగి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతనితో పాటు తమ్ముడి కుటుంబం చిన్నపాటి రేకుల షెడ్డులో ఉంటున్నారు. అతని కుమారుడు నాగరంగ వెంకట సత్యప్రసాద్‌కు 'తల్లికి వందనం' సొమ్ము జమ కాకపోవడంతో కారణం తెలుసుకునేందుకు సచివాలయానికి వెళ్లగా 'నీ పేరిట 46 ఎకరాలు ఉన్నట్టు ఆన్‌లైన్‌లో చూపుతోంది' అని సిబ్బంది తెలపడంతో ఖంగుతిన్నాడు.
- జన్ను శివనాగ రాజు వ్యవ సాయ పనులు చేసుకుంటూ పంటకాల్వ పక్కన ఇరిగేషన్ స్థలంలో షెడ్డు వేసుకుని జీవిస్తున్నాడు. అతనికి 47 ఎకరాలు ఉన్నట్టు చూపడంతో కుమార్తె జస్వంత్ సాహితి తల్లికి వందనం పథకానికి అనర్హురాలిగా తేలింది.





- మండవల్లిలోని కైకలూరు సందులో నివాసం ఉన్న శాయన కృష్ణ సురేష్‌కు 20 సెంట్లు భూమి ఉండగా 17 ఎకరాలు ఉన్నట్టు రికార్డులో నమోదు అయ్యింది. దీంతో అతని కుమారుడు నిఖిలేశ్వరకార్తీక్‌ను అనర్హుడిగా ప్రకటించారు.
- మండవల్లికి చెందిన ఆగోల్లు శ్రీనివాసరావుకు సెంటు భూమి లేదు. అతను వ్యవసాయ పనులు చేసుకుని జీవనం సాగించే పరిస్థితి. అతనికి 14 ఎకరాలు ఉన్నట్టు చూపడంతో కుమారులు రేవంత్‌కుమార్, నాగశరణ్యలకు తల్లికి వందనం పథకానికి దూరమయ్యారు.
- ముదినేపల్లికి చెందిన పోలగాని సత్యనారాయణకు మండవల్లిలో 17 ఎకరాలు ఉన్నట్లు రికార్డులో ఉండడంతో వారం రోజుల నుంచి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాడు.

'అన్నదాత సుఖీభవ'కు 2,397 మంది రైతులు దూరం

కుక్కునూరు: కుక్కునూరు మండలంలో వెబ్‌ల్యాండ్ క్లోజ్ అవడంతో 2,397 మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం వెబ్ పోర్టల్‌లో రిజెక్ట్ అయ్యాయి. రికార్డు ప్రకారం 1,749 మంది రైతులు చనిపోయారు. 645 మంది రైతుల ఆధార్ నంబర్ తప్పుగా చూపిస్తోంది. నాన్ వెబ్‌ల్యాండ్ ఆప్షన్, చనిపోయిన రైతులకు కోసం నామినీ ఆప్షన్ ఇవ్వాలని జిల్లా వ్యవసాయాధికారి కమిషనర్‌కి, డైరెక్టర్‌కి లేఖ ద్వారా సమస్య తెలియజేశారు' అంటూ మండల వ్యవసాయా ధికారి బాలాజీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నదాత సుఖిభవకు తమ పేర్లు రిజెక్ట్ కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యేకి చిర్రి బాలరాజు దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని జనసేన మండల అధ్యక్షుడు ఎం.యుగంధర్ తెలిపారు.

అర్హులైనా అందని వందనం

ముదినేపల్లి మండలం పేరూరు, పెయ్యేరు గ్రామాల్లో అర్హులైన పలు కుటుంబాలు తల్లికి వందనం లబ్ధిని పొందలేకపోయాయి. పేరూరుకు చెందిన రెండు కుటుంబాల పేరున ఒకే సర్వే నంబర్‌లో 128 ఎకరాల భూమి వెబ్ ల్యాండ్‌లో చూపించడంతో అనర్హుల జాబితాలో చేరాయి. వాస్తవానికి ఒకరికి 1.28 సెంట్లు భూమి, మరొకరికి 75 సెంట్లు భూమి ఉండగా గత ప్రభుత్వం నిర్వహించిన జోన్ రీసర్వే కారణంగా జాయింట్ ఎల్‌పీలు నమోదు కావడంతో వారి పేరున ఎక్కువ విస్తీర్ణం గల భూములను చూపిస్తున్నాయి. దీంతో ఆ కుటుంబాలు - మిగతా 8వ పేజీలో

విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉచిత ల్యాప్‌టాప్‌లు

ఏలూరు అర్బన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి):అర్హతలు కలిగిన శారీరక, బధిర, అంధ విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌టాప్‌లు అందజేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జేసీ ధాత్రిరెడ్డి తెలిపారు. డిప్లొమా ఐటీఐ/ పాలిటెక్నిక్/ గ్రాడ్యు యేషన్ ఆపై తరగతులు రెగ్యులర్ విధానంలో చదువుతూ, కుటుంబ వార్షికాదాయం రూ.3లక్షల లోపు, 40 శాతం ఆపై వైకల్యశాతం వున్న విద్యార్థులకు వికలాంగుల చట్టం-2016 మార్గదర్శకాలకు లోబడి జీవితకాలంలో ఒకసారి మాత్రమే ల్యాప్ టాప్‌ను అందజేస్తారన్నారు. జిల్లాలో అర్హులైన విభిన్న ప్రతిభావంతులు ఏపీడీఏఎస్‌సీఏసీ.ఏపీ.జీవోవి.ఐఎన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని, సంబంధిత ఆన్‌లైన్ షీట్, ధ్రువపత్రాలతో ఏలూరులోని విభిన ప్రతిభా వంతుల సంక్షేమశాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. అందిన ప్రతిపాదనల నుంచి విద్యార్థుల అర్హత, నిబంధనల మేరకు ల్యాప్‌టాప్‌లను ఉచితంగా మంజూరు చేస్తారన్నారు.



మంత్రులు దుర్గేశ్, సత్యకుమార్ యాదవ్ చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న డీపీవో అనురాధ

యోగాంధ్ర నినాదాల పోటీల్లో డీపీవోకు రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి

ఏలూరుసిటీ, జూన్ 18(ఆంధ్రజ్యోతి):రాష్ట్రస్థాయిలో నిర్వహించిన యోగాంధ్ర నినాదాల పోటీల్లో రాష్ట్ర స్థాయిలో జిల్లా పంచాయతీ అధికారిణి కొడాలి అనురాధ ప్రథమ బహుమతి సాధించారు. ఆమె రాసిన ప్రాణాయామ సాధన-పూర్ణాయుష్షుకి ఆలంబన, ఆసనాలే ఆయుధాలు- ఆరోగ్యానికి దోహదాలు.. అనే రెండు నినాదాలను పరిగణలోకి తీసుకుని రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి ఇచ్చారు. విజయవాడలో బుధవారం జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చేతుల మీదుగా ఆమె బహుమతిని అందుకున్నారు. విశాఖలో ఈనెల 21న ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు హాజరయ్యే యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఆమెకు లభించింది. 20వ తేదీ ఉదయానికి విశాఖ చేరుకోవాలని ఇప్పటికే అదేశాలు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా ఆమెను జిల్లా పంచాయతీ కార్యాలయ సిబ్బంది, డీఎల్‌పీవోలు, ఈవోఆర్డీలు, వివిధ శాఖలకు చెందిన సిబ్బంది అభినందించారు.

కొల్లేరు కాలుష్యంపై మీరేం చేశారు ?

- చేపల పెంపకం, వినియోగంపై తేడాలున్నాయా..
- ఏలూరులో వ్యర్థాలను ఎంత మేరకు శుద్ధి చేస్తున్నారు
- కొల్లేరులో పరిశీలించి, ఆరా తీసిన సాధికార కమిటీ
- అన్ని కోణాల్లో చూసి న్యాయం చేయండి : ఎమ్మెల్యేలు

కొల్లేరులో వాస్తవ పరిస్థితులను అధ్యయనం చేయడానికి వచ్చిన కేంద్ర సాధికార కమిటీ రెండు రోజుల వ్యవధిలోనే క్షేత్రస్థాయి నుంచి వినతుల వరకు ఆసాంతం గమనించింది. కొల్లేరు ఆపరేషన్‌కు ముందు, ఆ తర్వాత చోటు చేసుకున్న పరిణామాలపై వివిధ శాఖల నుంచి ఆరా తీసింది. రోడ్ల నిర్వహణ, ఏర్పాట్లపై జరిగిందేమిటో తెలుసుకోవడానికి ప్రయత్నిం చింది. సాధికార కమిటీ కార్యదర్శి జేఆర్ భట్, జి.భానుమతి, సునీల్ లిమాయే, చంద్రశేఖర్ గోయల్, ప్రకాశ్‌చంద్రభట్ నలుగురితో కూడిన బృందం మంగళవారం కైకలూరులో పర్యటించగా, బుధవారం ఏలూరు కేంద్రంగా ఉంగుటూరు, దెందులూరు, ఏలూరు ప్రాంతా వారి నుంచి వినతులను స్వీకరించింది. సమాంతరంగా పర్యావరణం, కాలుష్యం, ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యుఎస్, ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో సమీక్షించింది.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఉప్పుటేరులో కలిసే ఇరిగేషన్ డ్రెయిన్లు, డ్రెయిన్ల ద్వారా కొల్లేరులోకి వచ్చే కాలుష్యం నివారణకు ఏ చర్యలు తీసుకున్నారని కమిటీ ప్రశ్నించింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి చేరే కాలుష్యం నివారణకు వీలుగా నీటి శుద్ధి జరుగుతుందా ? డ్రెయిన్లు డీ సిల్టింగ్ చేస్తున్నారా.. లేదా.. దీనిపై సమగ్ర నివేదికను తమకు అందించాలని ఇరిగేషన్ ఎస్ఈ నాగార్జునరావును కమిటీ సభ్యుడు చంద్రశేఖర్ గోయల్ ఆదేశించారు. ఏలూరు నగరం నుంచి కొల్లేరులో కలుషిత జలాలు ఏ మేరకు ఉంటున్నాయి ? వీటిని శుద్ధి చేసే అవకాశం ఉందా, లేదా అంటూ కమిషనర్ భాను ప్రతాప్‌ను ప్రశ్నించారు. నగరంలో 32 ఎంఎల్‌డీ వ్యర్థాలు విడుదలవుతాయని, పారిశుధ్య వ్యర్థాలు 7 ఎంఎల్‌డీగా ఉందని, 5 ఎంఎల్‌డీ వ్యర్థాలను శుద్ధి చేసే ప్లాంట్ ప్రస్తుతం అందుబాటులో ఉందని కమిషనర్ వివరించారు. ఈ తరహా వ్యర్థాలన్నీ ఎక్కడి నుంచి ఎక్కడకు వెళుతున్నాయని, వీటిని మళ్లించేందుకు అవకాశం ఉందా, లేదా అంటూ కమిటీ ఆరా తీసింది.



కేంద్ర కమిటీ సభ్యులకు కొల్లేరు ప్రజల సమస్యలు తెలుపుతున్న దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని.. చిత్రంలో కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, కలెక్టర్ వెట్రిసెల్వి తదితరులు

నివేదికలు ఇవ్వాల్సిందే

కొల్లేరు అంతర్భాగంలో తాజా పరిస్థితులను గమనించామని, అయితే శాఖల వారీగా నివేదికలను కమిటీకి సకాలంలో ఇవ్వాలని కమిటీ అభిప్రాయపడింది. సరస్సు పరిధిలో పర్యావరణం, కాలుష్య పరిస్థితులు, చేపల పెంపకానికి వినియోగించే నీరు, తాగునీటి కాలుష్యం, పరిశ్రమల ద్వారా కొల్లేరులోకి వెళ్లే వ్యర్థాల కాలుష్యంపై సమగ్ర నివేదికను తమకు పంపాలని కాలుష్య నియంత్రణ మండలి ఈఈ వెంకటేశ్వరరావును కమిటీ ఆదేశించింది. తాగునీరు, భూగర్భ జలాలు, డ్రెయిన్ల కాలుష్య కారకాలపై ఎప్పటికప్పుడు పరిశీలిస్తూనే ఉన్నామని ఈఈ కమిటీ దృష్టికి తీసుకెళ్లారు.



తమను ఆదుకోవాలంటూ కమిటీ సభ్యులకు చేతులు జోడించి వేడుకుంటున్న కొల్లేరు ప్రజలు

కొల్లేరులో చేపల ప్రస్తావన

సరస్సులో ఎన్ని రకాల చేపలు పెంచుతున్నారు ? కాలుష్య నీటిలో ఉత్పత్తి అయ్యే చేపల వినియోగంతో తలెత్తుతున్న అనారోగ్య సమస్యలేమిటి? చేపల పెంపకానికి వినియోగించే రసాయనిక ఎరువులు, పురుగుల మందుల ద్వారా సరస్సు కలుషితం అవుతుందా ? దీనిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించింది.

హక్కులు కాపాడాలి : చింతమనేని

కొల్లేరు అంశంలో ఒక పార్శ్వమే కాకుండా ఇంకోవైపు చూడాలని బుధవారం ప్రజా ప్రతినిధులు, రైతులు, మహిళలు, పర్యావరణ ప్రేమికులు సాధికార కమిటీ దృష్టికి మరోసారి తీసుకెళ్లారు. కలెక్టరేట్‌లో గోదావరి సమావేశ మందిరంలో గంటన్నరకు పైగానే వినతులు అందుకున్నారు. అభయారణ్యం పరిధిలో 14 వేల ఎకరాల భూమిదారులు, మరో 20 వేల డి-ఫారం పట్టాదారుల హక్కులను కాపాడాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. కాంటూరు పరిధి తగ్గిస్తామన్నా ఇప్పటికీ నెరవేరలేదని, డ్రెయిన్ల డీ సిల్టింగ్ చేయని కారణంగా కొల్లేరు ప్రాంతం వరద సమయంలో ముంపునకు గురవుతోందని, డ్రెయిన్ల - మిగతా 8వ పేజీలో

కొల్లేరు అభివృద్ధి బోర్డు కావాలి : కామినేని

- కొల్లేరు అభివృద్ధి బోర్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. కొల్లేరు ప్రాంత ప్రజల సమస్యలను సానుకూల దృక్పథంతో పరిశీలించి న్యాయం చేయాలన్నారు.
- కొల్లేరులో పర్యావరణ, పక్షులను కాపాడేది రైతులేనని, కొల్లేరు అభయారణ్యం నోటిఫికేషన్ విడుదల చట్టంగా రూపొందించే సమయంలో ఆయా పరిణామాలపై ఎటువంటి అవగాహన లేదని, ఇప్పుడు తాజాగా అలాంటి పరిస్థితి ఎదురైందని, రాష్ట్ర ఫిష్ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నంబూరి వెంకటరామరాజు అభిప్రాయపడ్డారు.
- కొల్లేరులో 122 గ్రామాలుంటే, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన వారు అత్యధికులని, వీరిలో అభయారణ్యం చట్టంపై అవగాహన లేదని ఆ మేరకు ఇప్పటి వరకు కల్పించలేకపోయారని శివాజీ అన్నారు.
- జిరాయితీ, డి-ఫారం భూములను కొల్లేరు వాసులకు అందించాలని ఆ ప్రాంత నేత సైదు సత్యనారాయణ వేడుకన్నారు.
- కొల్లేరు ప్రజల సమస్యలపై కమిటీ సభ్యులకు జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ వినతి పత్రం సమర్పించారు. కాంటూరు కుదింపు, జిరాయితీ భూములు, డి-ఫారం భూముల సమస్యను ప్రస్తావించారు. కొల్లేరు సరస్సులోకి కలుస్తున్న 67 ప్రధాన కాలువలకు డీసిల్టింగ్ (మట్టి తొలగింపు), పునరుద్ధరణ పనులకు కేంద్ర ప్రభుత్వం సహాయం అవసరమని పేర్కొన్నారు.
- వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు చేతులు జోడించి తమను ఆదుకొండంటూ విజ్ఞప్తి చేయడంతో కమిటీ సభ్యులు ఆశ్చర్యచకితులయ్యారు.

పారదర్శకంగా అంగన్‌వాడీ సేవలు : పీడీ

ఏలూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి):జిల్లాలో అంగన్‌వాడీ సేవలను అన్ని వర్గాలకు పారదర్శంగా అందివ్వాలని, కొత్తగా చిన్నారులను చేర్పించడంలో సీడీపీవోలు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఐసీడీఎస్ పీడీ పెనుమాల శారద ఆదేశించారు. పీడీ కార్యాలయంలో జిల్లాలో 10 మంది సీడీపీవోలతో బుధవారం పలు అంశాలపై సమీ క్షించారు. చిన్నారులకు ఆధార్ సీడింగ్ పూర్తి చేయించాలని, డ్రాపవుట్స్‌ను తిరిగి పాఠశాలల్లో చేర్పించాలన్నారు. కార్యాలయ ఈవో మల్లిక, సీడీపీవోలు విజయలక్ష్మి, రాజశేఖర్, రామతులసి పాల్గొన్నారు.

నేడు సీసీఎల్ డిప్యూటీ కమిషనర్ రాక

ఏలూరు,జూన్ 18(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర భూపరిపాలన శాఖ డిప్యూటీ కమిషనర్ ప్రభాకర్‌రెడ్డి జిల్లా పర్యటనకు రానున్నారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన పేదల ఇళ్లస్థలాల ఎంపికలు, భూముల రీ సర్వే, ఇతర అంశాలపై జేసీ ధాత్రిరెడ్డి, ఇతర అధికారులతో సమీక్షించనున్నారు. అనంతరం క్షేత్రస్థాయిలో భూముల రీసర్వే పరిశీలించే అవకాశం ఉంది.

డీఎస్సీ పరీక్షకు 35 మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి):మెగా డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షల్లో భాగంగా బుధవారం జరిగిన పరీక్షకు స్థానిక సిద్ధార్థ క్వెస్ట్ కేంద్రంలో ఉదయం షిఫ్టునకు 180 మంది అభ్యర్థులకు 174మంది, మధ్యాహ్నం షిఫ్టునకు 180 మందికి 177మంది, ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కేంద్రానికి ఉదయం 141 మందికి 128, మధ్యాహ్నం 145 మందికి 141, సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రానికి ఉదయం 200 మందికి 197, మధ్యాహ్నం 203 మందికి 197 మంది హాజరయ్యారు. మొత్తం మీద 35 మంది గైర్హాజరయ్యారు.

ఉపాధి కూలీలకు ఊరట



- వారి వేతన బకాయిల సొమ్ములు విడతల వారీగా విడుదల
- మొత్తం చెల్లించాల్సిన బకాయిలు రూ.193.34 కోట్లు
- చెల్లించినది రూ.60.43 కోట్లు
- ఇవ్వాల్సింది రూ.133.09 కోట్లు

ఏలూరుసిటీ, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు వేతన బకాయిల సొమ్ములు విడతల వారీగా విడుదల అవుతున్నాయి. ఏప్రిల్ 15 నుంచి ఇప్పటివరకు జిల్లాలో ఉపాధి కూలీలకు సంబంధించి రూ.193.34 కోట్లు వేతన బకాయిలు ఉండగా ఇందులో ఇప్పటివరకు రూ.60.43 కోట్లు వేతన బకాయి సొమ్ములు విడుదల కావడంతో పాటు ప్రతిరోజు వేతనాలకు సంబంధించి బకాయి సొమ్ములు విడుదలవుతున్నాయని సంబంధిత శాఖాధికారులు చెబుతున్నారు. జిల్లాలో చెల్లించాల్సిన వేతన బకాయిలు ఇంకా రూ.133.09 కోట్లుగా ఉంది. వేతన బకాయిలు పేరుకుపోవడంతో ఉపాధి కూలీలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది.

జిల్లాలో జోరుగా ఉపాధి పనులు జరుగుతున్నాయి. గత రెండు నెలల్లో లక్ష్యానికి మించి కూలీలకు పని కల్పించినట్టు అధికారుల నివేదికలు చెబుతున్నాయి. కూలీలకు రోజువారీ కనీస వేతనం రూ.282 చెల్లిస్తున్నారు. దీంతో రోజువారీ కూలీల సంఖ్య పెరుగుతోంది. ఒక పక్క వ్యవసాయ పనులు ఉన్నా ఉపాధి పనులు జోరుగా సాగుతున్నాయని చెబుతున్నారు. వ్యవసాయ పంట కాలువలు, చెరువుల్లో పూడికతీత పనులు, ఫాం పాండ్స్ (పంట నీటి కుంటలు) వంటి పనులు ఎక్కువగా జరుగుతున్నాయి.

వేతన దారుల కుటుంబాల సంఖ్య 3.83 లక్షలు

జిల్లాలో ఉపాధి హమీ పథకంలో మొత్తం వేతన దారుల కుటుంబాలు 3 లక్షల 83వేలు ఉన్నాయి. ఈ కుటుంబాలకు సంబంధించి వేతనదారులు 6లక్షల 92 వేల మంది వరకు ఉన్నారు. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం 2లక్షల 18వేల కుటుంబా లకు పని కల్పించినట్టు డ్వామా శాఖ నివేదికలు చెబుతున్నాయి. ఉపాధి హామీ పనికి హాజరైన వేతన దారుల సంఖ్య 3లక్షల 45 వేల మంది వరకు ఉన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు కల్పించిన పనిదినాల సంఖ్య 68.78 లక్షలుగా నివేదికలో పేర్కొన్నారు. ప్రస్తుతం రోజువారీ లక్షా 8వేల మంది కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారు.

కోకో గింజల దొంగల ముఠా అరెస్ట్

రూ. 2.15 లక్షల విలువైన 430 కేజీల కోకో గింజలు స్వాధీనం

లోపలి పేజీలో..

ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తాం

- ఈ ఏడాది 15 వేల హెక్టార్ల సాగు లక్ష్యం
- రైతులకు పూర్తి సహకారం.. జేసీ అధ్యక్షతన మోనటరింగ్ కమిటీ ఏర్పాటు
- పెదవేగి ఆయిల్‌పామ్ పరిశోధన కేంద్రాన్ని సందర్శించిన మంత్రి నాదెండ్ల



లోపలి పేజీలో..

నట్టేట.. నిమ్మ రైతు

- మొన్న ఒకటి రూ.5.. నేడు కిలో రూ.5
- కూలి ఖర్చులు రాని వైనం.. రైతుల గగ్గోలు



మంత్రి మనోహర్, ఎమ్మెల్యే చింతమనేని, జేసీ ధాత్రిరెడ్డిలకు మొక్క పెరుగుదల గురించి వివరిస్తున్న ఆయిల్‌పామ్ పరిశోధన సంస్థ డైరెక్టర్

ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తాం

ఈ ఏడాది 15 వేల హెక్టార్ల సాగు లక్ష్యం

రైతులకు పూర్తి సహకారం

జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన మోనటరింగ్ కమిటీ ఏర్పాటు

పెదవేగిలోని ఆయిల్‌పామ్ పరిశోధన కేంద్రాన్ని సందర్శించిన మంత్రి నాదెండ్ల

పెదవేగి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణానికి అనువుగా ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తోందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖామంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఈ ఏడాది 15 వేల హెక్టార్ల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగును విస్తరింప చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళికను సిద్ధం చేసిందని ఆయన తెలిపారు. పెదవేగిలోని జాతీయ ఆయిల్‌పామ్ పరిశోధన సంచలనాలయాన్ని స్థానిక ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, జేసీ పి.ధాత్రీరెడ్డితో కలిసి, మంత్రి నాదెండ్ల మనోహర్ బుధవారం సందర్శించారు. పరి శోధనా కేంద్రం, శాస్త్రవేత్తలు, రైతులు, పామాయిల్ సంస్థల ప్రతినిధులు, ప్రొఫెసర్లతో మంత్రి చర్చించారు. అధిక దిగుబడులను అందించే కొత్త వంగడాలు, కోకో వంటి అంతర పంటలపై అవగాహన, డెల్టా భూముల్లో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించడం, ఆయిల్ పామ్‌లో యాంత్రీకరణ వంటి వాటిపై సమీక్షించారు. మంత్రి మనోహర్ మాట్లాడుతూ పెదవేగిలో ఉన్న జాతీయ ఆయిల్‌పామ్ పరిశోధన కేంద్రం దేశంలోనే ఉన్నతమైన స్థానంలో ఉందన్నారు. 250 ఎకరాల్లో విస్తరించిన ఈ పరిశోధనా స్థానంలో పంటల పరిశోధన, టిష్యూ కల్చర్ వంగడాల తయారీ వంటివి జరుగుతున్నాయని చెప్పారు. అధిక దిగుబడు లనిచ్చే వంగడాల తయారీపై శాస్త్రవేత్తలు నిమగ్నమయ్యారని ఆయిల్‌పామ్ పరిశోధనా సంస్థ డైరెక్టర్ డాక్టర్ కంచెర్ల సురేష్ వివరించారు. దెందులూరు ఎమ్మెల్యే చింత మనేని ప్రభాకర్ ఆయిల్‌పామ్ సాగులో ఎదురయ్యే సమస్యలు, మద్దతు ధర వంటి అంశాలను మంత్రికి వివరించారు. పంటల సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో క్షేత్రస్థాయిలో వాస్తవ సమాచారం అందరితో పంచుకోవడంలో జాప్యం కనిపిస్తోందని దీనిని పరిష్కరించేందుకు జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయిలో మోనటరింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, రైతు సహాయ కేంద్రంలో సిబ్బంది, క్షేత్రస్థాయిలో పర్యటించే హార్టికల్చర్ విస్తరణాధికారులతో పాటు ఐదు కంపెనీల ప్రతినిధులు, పెదవేగిలోని ఆయిల్‌పామ్ పరిశోధనాకేంద్రం సహకారంతో శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణ యించామని మంత్రి వివరించారు. నెలనెలా సమావేశం ఏర్పాటుచేసి, సమస్యల పరి ష్కా రానికి చర్యలు తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వం ఆయిల్‌పామ్‌కు ఒక్క రూపాయి కూడా రాయితీ ఇవ్వకుండా రైతులను మోసం చేసిందని, రూ.54 కోట్లు బకాయి పెట్టి ఆయిల్ పామ్ ప్రాడ్యూసర్లను మోసం చేసిందని తెలిపారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. జిల్లా ఉద్యాన శాఖాధికారి ఎస్.రామ్మోహన్, శాస్త్రవేత్తలు, పామాయిల్ కంపెనీల ప్రతినిధులు, రైతులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



శనివారపుపేట జడ్పీ హైస్కూల్‌ను సందర్శించి ఆహారాన్ని రుచి చూస్తున్న జడ్జి రత్నప్రసాద్

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

హైస్కూల్‌ను సందర్శించిన న్యాయాధికారి రత్నప్రసాద్

ఏలూరు క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు అందించే ఆహార విషయంలో మరింత నాణ్యత పాటించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నప్రసాద్ సూచించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ బుధవారం ఏలూరు సమీపంలోని శనివారపుపేటలో జడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు.మధ్యాహ్న భోజన పథకం అమలవుతున్న తీరును పరిశీలించారు.

ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థులకు ఎప్పటికప్పుడు మారుతున్న చట్టాలపై అవగాహన కలిగించాలని, కౌన్సెలింగ్ నిర్వహించి ఆత్మ స్థైర్యాన్ని నింపాలని సూచించారు. విద్యార్థినులకు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగించారు. విద్యార్థులతో మాట్లా డుతూ అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. డీసీపీవో సూర్య చక్రవేణి, వన్ స్టాప్ అడ్మిన్ నిర్మల, పాఠశాల హెచ్ఎం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



ఆచంటలో నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన రహదారి

ఎండ తీవ్రత..ఉక్కబోతతో అల్లాడిన ప్రజానీకం

ఆచంట,జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా వాతావరణం మబ్బులు పట్టి చిరుజల్లులు పడటంతో ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. బుధవారం ఎండ్ర తీవ్రత పెరగడం, దానికి తోడు ఉక్కబోత, వేడిగాలులతో ప్రజలు అల్లాడిపోయారు. మధ్యాహ్న సమయంలో ఎండ తీవ్రతకు ఆచంటలో ప్రధాన రహదారులు సైతం జన సంచారం లేక నిర్మానుష్యంగా కనిపించాయి.

తల్లికి వందనం సొమ్ముల కోసం

అమ్మల క్యూ

బ్యాంకులు, పోస్టాఫీసుల వద్ద రద్దీ



భీమవరం హెడ్ పోస్టాఫీస్ వద్ద క్యూలో మహిళలు

తాడేపల్లిగూడెం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం డబ్బులు తల్లుల ఖాతాల్లో పడటంతో వాటిని తీసుకునేందుకు వారంతా బ్యాంక్‌లు, పోస్టాఫీస్‌ల వద్ద క్యూకట్టారు. ఉమ్మడి జిల్లాలోని పలు బ్యాంకుల వద్ద ఉదయం 7 గంటల నుంచే రద్దీ కనిపించింది. ఇక పోస్టాఫీస్ వద్ద జనమే జనం. పాస్‌బుక్‌లు తీసుకుని వచ్చి క్యూలైన్లో నిలబడ్డారు. కొన్ని పోస్టాఫీస్‌ల్లో సరిపడినంత నగదు నిల్వలు లేకపోవడంతో కొంత ఇబ్బందిగా మారింది. ఇలాంటి చోట్ల కొద్దిపాటి వాగ్వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఎలాంటి ఇబ్బందులనైనా ఎదుర్కొని డబ్బును ఇంటికి తీసుకెళ్లాలనే సంకల్పంతో తల్లులు క్యూలైన్లు వదలడం లేదు. రెండు రోజులుగా బ్యాంక్‌లు, పోస్టాఫీస్‌లు లబ్ధిదారులతో కిటకిటలాడుతున్నాయి.

ఆధార్ కేంద్రాలు కిటకిట

ఎక్కడ ఆధార్ కేంద్రం కనిపించినా అక్కడ పిల్లతో కిటకిటలాడుతున్నాయి. ఆధార్ ఈకేవైసీ అవ్వాలంటే తప్పని సరిగా ఆధార్ అప్‌డేట్ కావాల్సి ఉంది. ఆధార్ ఈకేవైసీ కాకపోవడంతో కొంతమందికి బ్యాంక్ అకౌంట్లలో జమకాలేదు. దీంతో వీరంతా ఆధార్ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. తాడేపల్లిగూడెం పట్టణంలో పోస్టాఫీస్, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, జిల్లా పరిషత్ హైస్కూల్ ఎదుట,



ఏలూరులో సొమ్ములు తీసుకున్న తల్లుల ఆనందం

గొల్లగూడెం సెంటర్, మున్సిపల్ కార్యాలయం ఆవరణలోను, పాత గవర్నమెంట్ ఆసుపత్రి వద్ద ఆధార్ కేంద్రాలు ఉన్నాయి. ఇవి కాకుండా 14వ వార్డు సచివాలయం వద్ద, 11వ వార్డు సచివాలయం, 22వ వార్డు సచివాలయంలో కూడా ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

సచివాలయాల్లోను అదే పరిస్థితి

ఎక్కడ సచివాలయం ఉంటే ఆ ప్రాంతానికి చెందిన లబ్ధిదారులు క్యూ కడుతున్నారు. తల్లికి వందనం తప్పులు సరిచేయించుకోవాలంటే వాటికి సంబంధించిన డాక్యుమెంట్లు అందించాల్సి ఉంది. ప్రధానంగా తల్లికి వందనం లబ్ధిదారులకు ఆటంకంగా మారిన విద్యుత్ వాడకానికి సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా రావడంతో వాటిని సరిచేయించుకునేందుకు విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలకు క్యూ కడుతున్నారు. అక్కడ సరి చేయించుకున్న తర్వాత సచివాలయల్లోని అధికారులకు దరఖాస్తులు సమర్పించుకునేందుకు వస్తున్నారు.



తాడేపల్లిగూడెం పోస్టాఫీస్ వద్ద ఆధార్ అప్‌డేట్ కోసం ..



ఏలూరు కోటదిబ్బ పెద్ద పోస్టాఫీస్ వద్ద సొమ్ముల కోసం తల్లులు..



క్యూ లైన్‌లో మహిళలు..

నట్టేట.. నిమ్మ రైతు



లక్ష్మీపురం మార్కెట్ యార్డులో రాసిగా పోసిన నిమ్మకాయలు

బయట మార్కెట్‌లో మొన్నటివరకు ఒక్కో నిమ్మకాయ నాలుగు నుంచి ఐదు రూపాయల అమ్మారు. ఇప్పుడు కిలో రూ.5. ఇది నిజమే.. కిలో నిమ్మకాయలు అక్షరాలా ఐదు రూపాయలు. ఇది మంగళవారం ఏలూరు మార్కెట్ యార్డులో పలికిన ధర.. కనిష్టంగా రూ.5 కాగా గరిష్టంగా రూ.10. ధర తగ్గిందంటే మొన్నటివరకు ఉన్న ధర రూ.40లకు కొంచెం అటూ ఇటుగా ఉంటుందని రైతులు భావించారు. కానీ ఇప్పుడు భారీగా పడిపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడి అటుంచితే కూలి ఖర్చులు కూడా రాని పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు.

మొన్న ఒకటి రూ.5.. నేడు కిలో రూ.5

కూలి ఖర్చులు కూడా రాని వైనం

గగ్గోలు పెడుతున్న రైతులు

పెదవేగి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ఏడాదిన్నర నుంచి కిలో ధర రూ.40 ఆపైన ఉండగా, నెలరోజులుగా హెచ్చు తగ్గులతో ఊగిసలాడి ఇప్పుడు రూ.10కి పడిపోయింది. 50 కిలోల బస్తా కోయడానికి మనిషికి రూ.250 కూలి ఇస్తాం.. ఆ బస్తాను మార్కెట్‌కు తరలించడానికి ఆటోకు కిరాయి రూ.50..



ధర లేకపోవడంతో రహదారి పక్కన పారబోసిన నిమ్మకాయలు

దింపుడు కూలి రూ.10 ఇవ్వాల్సి ఉంటుంది.. కాగా వ్యాపారి పదిశాతం కమీషన్ తీసుకుంటారు.. కిలో రూ.6 ఉంటే 50 కిలోల బస్తాకు రూ.300 వస్తుంది. ఒక బస్తా మార్కెట్‌కు చేర్చేసరికి కమీషన్ సొమ్ము పదిశాతం రూ.30లతో కలుపుకుని రూ.340 అవుతుంది. అంటే రూ.40 రైతు జేబులోనుంచి చెల్లించాల్సి వస్తోంది. దీంతో రైతులు నిమ్మకాయల కోతను నిలిపేస్తున్నారు. కాయలు పండి రాలి చెట్ల కిందే ఉంటే చెట్టు పాడవుతుందని, దీంతో ఆ కాయలను ఏరివేసి, బయట పారపోయాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు. మూడేళ్ల కిందట ఇలాగే ధర పతనం కాగా రైతులు నిమ్మ తోటలను తొల గించేశారు. ఇప్పుడు మరోసారి అలాంటి ప్రమాదం పొంచి ఉంటుందేమోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

• బస్తాకు రూ.85 తిరిగి చెల్లించాల్సి వచ్చింది



ఒక్కసారిగా తగ్గిన ధర మా ఆశలను అడియాశలు చేసింది. పెట్టుబడి పక్కన బెడితే శ్రమకూడా దక్కదు. మంగళవారం రెండు బస్తాలు (బస్తా 50 కిలోలు) ఏలూరు మార్కెట్ యార్డుకు పంపిస్తే కిలో రూ.5లకు కొన్నారు. బస్తాకు రూ.250 చొప్పున రెండు బస్తాలకు రూ.500 వచ్చింది. కాగా ఒక్కో బస్తాకు కోత కూలి రూ.250, కిరాయి రూ.50, దింపుడు కూలి రూ.10, రూ.పదిశాతం కమిషన్ రూ.25, వెరసి బస్తా ఒక్కింటికి రూ.335 ఖర్చు అయింది. కానీ చేతికి వచ్చింది మాత్రం రూ.250. దీంతో రూ.85 బాకీ పడ్డాను..

- మేకా నాగభూషణం, నిమ్మరైతు, లక్ష్మీపురం, పెదవేగి మండలం

• రూ.30 చేతికొచ్చింది



బుధవారం రెండు బస్తాల నిమ్మకాయలు తీసుకెళ్లాను. కిలో రూ.10 ధర వచ్చింది. మొత్తంగా వెయ్యి రూపాయలు వచ్చాయి. రెండు బస్తాలు కోయడానికి ముగ్గురు కూలీలు వచ్చారు. వారికి రూ.750 కూలి ఇవ్వాలి. కిరాయి రూ.100, దింపుడు కూలి రూ.20, వ్యాపారి కమీషన్ రూ.100, వచ్చిన రూ.1000లలో రూ.970 పోగా చేతికొచ్చింది రూ.30. ఇక తోటకు పెట్టుబడి, మా శ్రమ ఇవన్నీ చూస్తే మొత్తంగా నష్టమే కనిపిస్తోంది.

బొర్రా రాము, నిమ్మరైతు, లక్ష్మీపురం

• వ్యాపారులకూ నష్టాలే



ధరలో హెచ్చుతగ్గులు రైతులతో పాటు వ్యాపారులను తీవ్రంగా నష్టపరస్తున్నాయి. ఈరోజు ఉన్న ధరకు కొనుగోలు చేసిన తరువాత రెండోరోజు ధర పతనంతో కొనుగోలు చేసిన వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారు. కొన్న సరుకు ఎగుమతి చేయడానికి కొనుగోలుదారులు లేక ఆగిపోవడంతో నష్టపోవాల్సి వస్తోంది. ఒడిదుడుకుల మధ్య వ్యాపారంలో నష్టాలను చవి చూస్తున్నాం.

ఈ వేసవి దెబ్బకొట్టింది



అంతంతమాత్రమే..గతేడాది జూన్ నెలలో ఉష్ణోగ్రత 46 డిగ్రీలుగా ఉంది. అదే ఈ ఏడాది జూన్ నెలలో ఉష్ణోగ్రత 35 డిగ్రీలకు పడిపోయింది. ఇది కూడా నిమ్మధరపై ప్రభావాన్ని చూపింది. ఈ ఏడాది మేనెల నుంచి దేశవ్యాప్తంగా వర్షాలు పడుతుండ డంతో నిమ్మ కాయలకు డిమాండ్ తగ్గింది. అప్పుడు పది లారీల సరుకు వెళ్తే ఈరోజున రెండులారీల సరుకు వెళ్లడం కష్టమైంది. మంగళవారం కొనుగోలు చేసిన 6.50 టన్నుల నిమ్మకాయలు ఎగుమతిలేక ఇక్కడే ఆగిపోయాయి. ఏలూరు జిల్లా నుంచి నిమ్మకాయలు ఎక్కువగా ఒడిశా, పశ్చిమబెంగాల్, ఛత్తీస్‌గఢ్, అసోం, బిహార్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలకు ఎక్కువగా ఎగుమతి జరుగుతుంది. నెలరోజులుగా కురుస్తున్న వర్షాలతో నిమ్మకాయల వాడకం తగ్గి, ధర భారీగా పతనమైంది. సోమవారం 4 లారీల కాయలు ఎగుమతి చేయగా మంగళవారం కొనుగోలు చేసిన సరుకు ఇక్కడే ఆగిపోయింది. బుధవారం రెండు లారీల సరుకు మాత్రమే వెళ్లింది.

- ఆలపాటి రంగారావు, దెందులూరు మార్కెట్‌యార్డు వర్తకసంఘం అధ్యక్షుడు, కొత్తపల్లి

రిటైల్‌గా మాత్రం బయట మార్కెట్‌లో డజను రూ.30, రూ.40 లుగా ఉంది.

నాగేంద్ర, నిమ్మ వ్యాపారి, ఏలూరు


ఎన్టీఆర్ పార్కుకు మంచిరోజులు

రూ.25 లక్షలతో అభివృద్ధి పనులు

తణుకు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : తణుకు పట్టణంలోని ఎన్టీఆర్ పార్కుకి మళ్లీ మంచిరోజులు వస్తున్నాయి..పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే ఏకైక పార్కు ఇదే.. టీడీపీ హయాంలో దీనిని ఏర్పాటు చేసి అభివృద్ధి చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు టీడీపీ హయాంలోనే పార్కు నిర్వహణ, అభివృద్ధిపై దృష్టి సారించారు. టీడీపీయేతర ప్రభుత్వాలు కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవు. గత మే నెలలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్ళి పార్కుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి విన్నవించారు. దీంతో పార్కుల అభివృద్ధికి రూ. 25 లక్షలు, పట్టణ అభివృద్ధికి మరో రూ.25 లక్షలు కలిపి రూ.50 లక్షలు నిధులు మంజూరుకు ఆమోదం తెలిపారు.

ఆహ్లాదం కరువైంది..

చిన్న, పెద్ద అనే తేడా లేకుండా అందరికి ఈ పార్కు ఆహ్లాదాన్ని పంచేది. పిల్లలకు ఆట వస్తువులతో పాటు బోటింగ్ వంటి సౌకర్యాలు ఉండేవి. పెద్దవాళ్లు వాకింగ్ చేసేందుకు వాకింగ్ ట్రాక్ ఉంది. ఐదేళ్లుగా నిర్వహణ లేక పట్టణ ప్రజలకు ఆహ్లాదం కరువైంది.. దీనిని అధిగమించి తొందరలోనే సుందరమైన పార్కుగా తీర్చిదిద్దనున్నారు. ప్రస్తుతం పార్కులో ఉన్న ఆట వస్తువులతో పాటు అదనంగా కొత్త వస్తువులు ఏర్పాటు చేయనున్నారు. పార్కులో సందర్శకులు ఎక్కువ సమయం గడిపేలా ఆట వస్తువులతో పాటు బోటింగ్ వంటివి ఉండేవిధంగా చర్యలు తీసుకోనున్నారు.





పార్కులో బోటింగ్ కోసం అనుకూలంగా ఉన్న చెరువు



పార్కు ఎంట్రన్స్‌లో తెలుగుతల్లి విగ్రహం వద్ద ఫౌండేన్

త్వరలోనే పనులు ప్రారంభం



ఎన్టీఆర్ పార్కు అభివృద్ధి విషయంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ సూచనలు మేరకు పట్టణ ప్రజలు అభిరుచులకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్నాం. ప్రస్తుతం డీపీఆర్‌లు తయారు చేస్తున్నారు. తొందర్లోనే పనులు ప్రారంభిస్తాం.

టి.రామ్‌కుమార్,మున్సిపల్ కమిషనర్, తణుకు



ఆలయ హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది, సేవకులు

చిన వెంకన్న హుండీ ఆదాయం రూ.3.68 కోట్లు

ద్వారకాతిరుమల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల చిన్నతిరుమలేశునికి హుండీల లెక్కింపు ద్వారా భారీ ఆదాయం సమకూరింది. 28 రోజుల కాలానికి జరిగిన ఈ లెక్కింపులో నగదు రూపేణా రూ.3.68 కోట్లు ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో ఎన్వీ సత్యన్నారాయణమూర్తి తెలిపారు. ప్రమోద కల్యాణ మండప ఆవరణలో బుధ వారం అత్యంత భద్రతా ఏర్పాట్ల మధ్య హుండీ ఆదాయం లెక్కింపు నిర్వహించారు. 3,68,88,156 రూపాయల నగదుతో పాటుగా 317 గ్రాముల బంగారం, 7.877 కేజీల వెండి లభించినట్లు ఈవో వివరించారు. రద్దయిన పాతనోట్లు రూ.500 (22), 1000(12) 2000(13)తో పాటు విదేశీ కరెన్సీ లభించింది.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఆగిరిపల్లి విద్యార్థులు


విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆగిరిపల్లి, జూన్ 18 (ఆంధ్ర జ్యోతి):రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఆగిరిపల్లి జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రహర్ష, రోహిత్, అభిలాష్ ఎంపికయ్యారని హెచ్‌ఎం పుష్పలత తెలిపారు. హెచ్‌సీఎల్ ఈ ఏడాది ఏప్రిల్‌లో గన్నవరం ఎన్టీఆర్ వర్సిటీలో బాలురు అండర్-15 విభాగంలో నిర్వహించిన ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో వీరు ప్రథమ స్థానం సాధించారని, బెంగళూరులో ఈ నెల 28, 29 తేదీలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం లక్ష్మీ, వ్యాయమ ఉపాధ్యాయులు, శివనాగేంద్ర, సుగుణరావు, విద్యార్థులను అభినందించారు.

ఆయుష్ ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స


ఆసుపత్రిలో వైద్యుల పర్యవేక్షణలో రోగి

ఏలూరు అర్బన్, జూన్ 18(ఆంధ్ర జ్యోతి):పొట్టలో రక్తనాళాలు గడ్డ కట్టడం వల్ల సంభవించే సుపీరియర్ మెసెంటెరిక్ వెయిన్ థ్రోంబోసిస్ (ఎస్ఎంవీటీ) అనే అరుదైన, ప్రమాదకరమైన వ్యాధి నుంచి 61 ఏళ్ల వ్యక్తిని ఏలూరు ఆయుష్ ఆసుపత్రి వైద్య బృందం శస్త్ర చికిత్స చేసి కాపాడినట్లు ఆసుపత్రి మేనేజర్ కాశీనాథ్ జాస్తి బుధవారం మీడియాకు తెలిపారు. తీవ్ర కడుపు నొప్పితో బాధపడుతున్న ఆ వ్యక్తిని అతని కుటుంబీకులు సోమవారం అర్ధరాత్రి ఆసుపత్రికి తీసుకువచ్చారు. గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు, లివర్ శస్త్ర చికిత్స నిపుణుడు డాక్టర్ వేమూరిప్రసన్నకుమార్ రోగిని పరీక్షించి ఎస్ఎంవీటీ వ్యాధికి గురైనట్టు గుర్తించారు. ఆపరేషన్ ద్వారా పేగుల్లో నశించిన భాగాన్ని తొలగించి, మిగిలిన రక్తనాళాలను శుభ్రపరిచేందుకు యాంటీ కో ఆగ్యులెంట్ థెరపీ చేశారని, రోగి కోలుకుంటున్నాడని వివరించారు. వైద్య బృందంలో డాక్టర్ వేమూరి ప్రసన్నకుమార్, డాక్టర్ శ్రీరామ్, డాక్టర్ బాలమురళి, డాక్టర్ ప్రశాంతి ఉన్నారని తెలిపారు.

న్యాయం కోసం అత్తింటి ముందు బైఠాయింపు


ఆందోళన చేస్తున్న దుర్గాభవాని

నరసాపురం రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): న్యాయం కోసం ఓ మహిళ అత్తింటి ముందు బైఠాయించింది. పీఎం లంకకు చెందిన మైలా గంగరాజు కుమార్తె దుర్గాభవానికి పాత నవరస పురానికి చెందిన బర్రె శివశంకర్‌కు ఈ ఏడాది మార్చి 12న వివాహమైంది. కొద్ది రోజులు వీరి సంసారం సజావుగా సాగినా భర్త, అత్తమామల నుంచి అదనపు కట్నం వేధింపులు మొదలయ్యాయి. సంసారానికి పనికిరావంటూ ఆమెను వేధింపులకు గురిచేసి ఇంటి నుంచి బయటకు గెంటేసి తాళాలు వేయడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. అక్కడా న్యాయం జరగకపోవడంతో భర్త, అత్తమామల ఇంటి ముందు బుధవారం బైఠాయించింది. దీంతో అత్తింటివారు ఇంటికి తాళం వేసి పరారయ్యారు. తనకు న్యాయం జరిగేలా చూడాలని, భర్త, అత్తమామలపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరుతోంది.

పెన్షన్ రీ వెరిఫికేషన్‌కు వచ్చి హఠాన్మరణం..


సుధాకర్ మృతదేహం

ఏలూరు క్రైం, జూన్ 18(ఆంధ్రజ్యోతి):దివ్యాంగుల పెన్షన్ రీ వెరిఫికేషన్ కోసం ఆసుపత్రికి వచ్చి గుండె పోటుతో ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో బుధవారం జరిగింది. చింతలపూడి మండలం రేచర్లకు చెందిన ప్రొద్దుటూరి సుధాకర్ (63)కు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. సుధాకర్ నరాల బలహీనతతోపాటు గుండె సంబంధిత వ్యాధులు ఉన్నాయి. అతని పెద్ద కుమారుడు ప్రసాద్ కూడా దివ్యాంగుడే. వీరిద్దరికి ప్రభుత్వం పెన్షన్ ఇస్తుంది. వారి సదరం సర్టిఫికెట్ రీ వెరిఫికేషన్ కోసం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి బుధవారం హాజరుకావాలని అధికారులు నోటీసులు ఇవ్వడంతో తండ్రి, అన్నను తీసుకుని రెండో కుమారుడు కిషోర్ ఏలూరు ప్రభుత్వాసుపత్రికి వచ్చాడు. కొంతసేపటికి సుధాకర్ అకస్మాత్తుగా పడిపోవడంతో వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. గుండెజబ్బు వల్ల మరణించినట్టు నిర్ధారించారు. సుధాకర్ మరణంతో కుటుంబం కన్నీరు మున్నీరైంది.

వీధి కుక్క దాడిలో బాలుడికి తీవ్ర గాయాలు

పోలవరం జూన్ 18(ఆంధ్రజ్యోతి):వీధి కుక్క దాడిలో నాలుగేళ్ళ బాలుడు తీవ్ర గాయాలపాలైన ఘటన పోలవరం మండలం జిల్లెళ్లగూడెం పంచాయతీ పేడ్రాల గ్రామంలో జరిగింది. ఇంటి బయట ఆడుకుంటున్న బాలుడు తోకల షణ్ముఖ్‌పై వీధి కుక్క దాడిచేసి ముక్కు పట్టుకుని కరవడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. కుటుంబీకులు అతనిని ఎల్ఎన్‌డీ పేట పీహెచ్‌సీకి తరలించగా మెరుగైన వైద్యం కోసం పోలవరం ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఆరు కుట్లు వేశామని, రాబిస్ ఇంజక్షన్ కూడా ఇచ్చామని, ప్రస్తుతం బాలుడి ఆరోగ్య పరిస్థితి మెరుగుగా ఉందని ఆస్పత్రి సూపరింటెండెంట్ రాంబాబు తెలిపారు.

నేడు మావుళ్లమ్మ జ్యేష్ఠ మాస జాతర

భీమవరంటౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం, మావుళ్లమ్మ ఉత్సవ కమిటీ, దేవస్థానం ఆధ్వర్యంలో గురువారం మావుళ్లమ్మ జ్యేష్ఠమాస జాతర నిర్వహించనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు జాతరను ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు పూజలు చేసి ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో గ్రామోత్సవం నిర్వహిస్తారు. బేతాళశక్తి వేషధారణలు, మ్యూజికల్ ఫుల్ బ్యాండ్ ట్రూపు, డప్పుల బృందంతో అమ్మవారిని ఊరేగిస్తారు. ఈ సందర్భంగా భీమవరంలోని పండ్ల, కూరగాయలు, షాపులకు సెలవు ప్రకటించారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న పోలీసులు

ఏలూరు క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఏలూరు మండలం పోణంగికి చెందిన ఓ యువకుడికి, దెందులూరు మండలానికి చెందిన టెన్త్ చదువుతున్న బాలికకు బుధవారం వివాహం చేయాలని ఇరు కుటుంబాల వారు నిర్ణయించారు. బాలిక ఇంకా మైనర్ అయినందున ఈ వివాహం చట్టవిరుద్ధమని కొందరు సమాచారం అందించడంతో రూరల్ ఎస్ఐ దుర్గా ప్రసాద్ తమ సిబ్బందితో అక్కడకు వెళ్లి వివాహాన్ని అడ్డుకుని కేసు నమోదు చేశారు. ఇరు పక్షాల కుటుంబ సభ్యులను స్టేషన్‌కు తీసుకువచ్చి కౌన్సెలింగ్ ఇచ్చారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో వస్త్ర దుకాణం దగ్ధం

జంగారెడ్డిగూడెం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): దేవులపల్లిలోని ఓ వస్త్ర దుకాణంలో బుధవారం అగ్ని ప్రమాదం జరిగింది. దేవులపల్లి గ్రామానికి చెందిన ఎంఎస్ఎస్ఎన్. పద్మజ వస్త్ర దుకాణంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు అంటుకుని దుకాణంలోని వస్త్రాలన్నీ కాలిపోయాయి. స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించగా ఫైర్ ఆఫీసర్ అబ్రహాం ఆధ్వర్యంలో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. అప్పటికే దుకాణంలోని రూ.రెండు లక్షల విలువైన వస్త్రాలు కాలిపోయాయి.

మత్తులో వలస కూలీలు



గంజాయి సేవనంలో చేపల చెరువు వద్ద పనిచేసే కూలీలు, యువత

బెంగాల్, ఒడిశా రాష్ట్రాల నుంచి చేపల లారీల ద్వారా రవాణా

ఇటీవల నలుగురిని అరెస్టు చేసిన గణపవరం పోలీసులు

గణపవరం, జూన్ 18(ఆంధ్రజ్యోతి):పశ్చిమ గోదావరి జిల్లాలోని గణపవరం మండలంలోని పలు గ్రామాల్లో గంజాయి వినియోగం విచ్చలవిడిగా పెరుగుతోంది. యువతతో పాటు మైనర్లు కూడా మత్తుపదార్థాలకు బానిసలవుతున్నారు. ముఖ్యంగా బిహార్, పశ్చిమబెంగాల్, ఒడిశా రాష్ట్రాల నుంచి ఈ ప్రాంతంలోని చేపలు, రొయ్యల చెరువులపై పని చేసేందుకు వచ్చిన వలసకూలీలు గంజాయి మత్తులో మునుగుతున్నారు. కొల్లేరు, డెల్టా ప్రాంతాల్లో ఉండే ఆక్వాచెరువులపై పనిచేయడానికి వచ్చిన యువత గంజాయి సేవిస్తున్నారు. పశ్చిమ బెంగాల్, ఒడిశా ప్రాంతాల నుంచి చేపలలోడు దిగుమతి చేసుకుని వస్తున్న లారీల్లో గంజాయి రవాణా అవుతోందని సమాచారం. ఈనెల 7న ఐదు కేజీల గంజాయి రవాణా చేస్తున్న నలుగురిని గణపవరం పోలీసులు పట్టుకున్నారు. ఒడిశాకు చెందిన కారా అర్జున్ అనే వ్యక్తి గంజాయి రవాణాలో ప్రధాన పాత్ర పోషించాడు. గణపవరంలో ముఠాగా ఏర్పడి గంజాయి సేవించటం, పరిసర గ్రామాల్లో విక్రయాలు చేయడంతో పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. గతంలో కూడా అర్థవరం వద్ద 5 కిలోల గంజాయి పట్టుకున్నారు.

ఖాళీ ప్రదేశాల్లో సేవనం

గణపవరం బస్టాండ్, మండల పరిషత్ కార్యాలయాల సముదాయాల వద్ద, వెంకయ్య వయ్యేరు కాల్వ ఆలయాల వద్ద, శ్మశాన వాటిక ప్రాంతాల్లో గంజాయి సేవించటం, విక్రయాలు చేయడం వంటి కార్యకలాపాలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. బిక్షగాళ్లు కూడా సేవిస్తున్నారని తెలుస్తోంది. చేపల చెరువుల వద్ద పనిచేస్తున్న వలస కూలీలకు కూడా ఈ గంజాయి సరఫరా అవుతుండటంతో వ్యాపారం జోరుగా సాగుతోంది. గణపవరం మండలం చిన రామచంద్రపురం ఇందిరమ్మ కాలనీలో నివసిస్తున్న సాయికిషోర్ ఈనెల 7న గంజాయి కేసులో అరెస్టయ్యి ఏలూరు సబ్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. అతను అనారోగ్యానికి గురై మృతి చెందాడు.


ఇటీవల గణపవరంలో దాడులు చేసి పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు (ఫైల్)

నియంత్రణకు చర్యలు : ఎస్ఐ మణికుమార్

గణపవరం పరిసర ప్రాంతాల్లో గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలు అరికట్టేందుకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఈ నెల 7వ తేదీన నలుగురిని అరెస్టు చేసిన రిమాండ్‌కు తరలించాం. యువత పెడదోవ పట్టకుండా అనుమానిత ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేశాం. పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం.

ఉద్యోగులే కౌన్సెలింగ్ ఆఫీసర్లు !?

ఉమ్మడి జిల్లా వైద్య సిబ్బంది బదిలీలన్నీ ఆ ఇద్దరి కనుసన్నల్లోనే

పారదర్శకంగానే కౌన్సెలింగ్ : డీఎంహెచ్‌వో కార్యాలయ ఏవో

జూమ్ కౌన్సెలింగ్ వీడియో కాపీతో ఫిర్యాదు చేయనున్న రిటైర్డ్ ఉద్యోగి

ఏలూరు అర్బన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ముఖ్య అధికారి సమక్షంలో జరగాల్సిన ఉద్యోగుల సాధారణ బదిలీ కౌన్సెలింగ్ అదే శాఖ కార్యాలయంలోని ఇద్దరు ఉద్యోగుల కనుసనల్లో నడిపించడంపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో బుధవారం చర్చనీయాంశమైంది. ఇటీవల జరిగిన సీనియర్ ఏఎన్ఎంల బదిలీ కౌన్సెలింగ్‌ను సైతం ఈ ఇరువురు ఉద్యోగులే మ్యాచ్ ఫిక్సింగ్ పద్ధతిన జరిపించేశారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా బుధవారం ఉమ్మడి జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న డ్రైవర్లు (9మంది), ల్యాబ్ టెక్నీషియన్లు (6), ఎల్‌డీ కంప్యూటర్ అసిస్టెంట్లు (7), ఎంఎన్‌వోలు (1), ఎఫ్ఎన్‌వోలు (1), తోటీలు(1), ఆఫీసు సబార్డినేటు (18), స్వీపర్లు (6)కు జూమ్ విధానంలో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించి ఉద్యోగుల ఐచ్ఛికాలు, మార్గదర్శకాల మేరకు నూతన స్థానాలను కేటాయించారు. ఒకేచోట దీర్ఘకాలం పనిచేసినవారిని తప్పనిసరి బదిలీ కింద వేకెన్సీల ఆధారంగా నియమించారు. ఏలూరు డీఎంహెచ్‌వో కార్యాలయం వేదికగా ఉమ్మడి జిల్లాలోని సంబంధిత కేడర్ల ఉద్యోగులకు ఆయా పీహెచ్‌సీలను అనుసంధానం చేసుకుని జూమ్ విధానంలో నిర్వహించిన కౌన్సెలింగ్ జిల్లా వైద్యాధికారి నేతృత్వంలో జరగాల్సి ఉండగా, కార్యాలయంలో పనిచేస్తున్న ఇరువురు ఉద్యోగులే కౌన్సెలింగ్ ఆఫీసర్లుగా వ్యవహరిస్తూ ఆయా వేకెన్సీలను ఉద్యోగులకు ముందుగానే ఫిక్స్ చేసి లేదా కొందరు ఉద్యోగులు రింగ్‌గా ఏర్పడి మంచి స్థానాలకు బదిలీ నిర్ధారించుకుంటే మొక్కుబడిగా ఓకే చేసేశారని ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి బదిలీ కౌన్సెలింగ్ అంటే సంబంధిత శాఖ జిల్లా అధిపతి సమక్షంలో ఉద్యోగిని జూమ్ వేదిక వద్దకు పిలిచి, సీనియార్టీ జాబితా, స్పౌజ్, ప్రిఫరెన్షియల్ కేటగిరీ, తదితర ప్రాధాన్యతాక్రమంలో అందుబాటులో వున్న వేకెన్సీలను చూపించి వాటినుంచి ఖరారు చేసుకునేందుకు అవకాశం ఇస్తారని చెబుతున్నారు. ఇదేరీతిలో రాజమహేంద్రవరం రీజినల్ డైరెక్టర్ సమక్షంలో జరిగిన జోన్-2 ఉభయగోదావరి, కృష్ణా జిల్లాల స్టాఫ్ నర్సుల బదిలీల కౌన్సెలింగ్ పారదర్శకంగా ఆర్డీ ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగిన విషయాన్ని గుర్తుచేస్తున్నారు. దీనికి భిన్నంగా ఉమ్మడి జిల్లా పీహెచ్‌సీల వైద్య ఉద్యోగుల బదిలీ కౌన్సెలింగ్ యావత్తూ ఇద్దరు కార్యాలయ ఉద్యోగుల ఆధ్వర్యంలో జరగటం నిబంధనలకు వ్యతిరేకమని చెబుతున్నారు. ఇదే విషయంపై వైద్య ఆరోగ్యశాఖలో ఓ రిటైర్డ్ ఉద్యోగి బుధవారం జరిగిన జూమ్ కౌన్సెలింగ్ రికార్డెడ్ వీడియో కాపీని సమాచారహక్కు చట్టంకింద తీసుకుని, దానినే సాక్ష్యంగా పెట్టి బదిలీలు నిబంధనలకు విరుద్ధంగా జరిగాయంటూ నేరుగా వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు తెలిసింది.

మార్గదర్శకాల మేరకే బదిలీలు

డాక్టర్ గంగాభవాని, డీఎంహెచ్‌వో కార్యాలయ ఏవో

పీహెచ్‌సీల వైద్య ఉద్యోగుల బదిలీలు ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు డీఎంహెచ్‌వో నేతృత్వంలో పారదర్శకంగా నిర్వహించాం. అన్యాయం జరిగిందని ఏ ఒక్కరూ ఫిర్యాదు చేయక పోవడమే దీనికి నిదర్శనం. అందరూ సంతృప్తి వ్యక్తం చేశారు. నిరాధార ఆరోపణలు పట్టించుకోం. ఉమ్మడి జిల్లాలోని ఫార్మసిస్టులు, సీనియర్ అసిస్టెంట్లకు గురువారం రాజమహేంద్రవరంలోని ఆర్డీ కార్యాలయంలో కౌన్సెలింగ్ జరుగుతుంది.

టెన్సింగ్ నార్గే జాతీయ సాహస పురస్కారాలకు నామినేషన్ల ఆహ్వానం

ఏలూరు అర్బన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : భారత యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వ శాఖకు చెందిన టెన్సింగ్ నార్గే జాతీయ సాహస పురస్కారానికి (టీఎన్ఎన్ఏఏ)కి ఆన్‌లైన్ ద్వారా నామినేషన్లను ఆహ్వానిస్తున్నట్టు సెట్‌వెల్ సీఈవో కె.ఎస్ ప్రభాకరరావు తెలిపారు. భూమిపై, నీటిపై (నావికా సంబంధమైన), వాయు విన్యాస సంబంధమైన సాహసాల్లో అత్యుత్తమ విజయం సాధించినవారు, సాహస క్రీడల్లో అంకితభావంతో నైపుణ్యాన్ని ప్రదర్శించిన వ్యక్తులకు జీవితకాల సాఫల్యం (లైఫ్‌టైం ఎచీవ్‌మెంట్) కింద నాలుగు కేటగిరీల్లో అవార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. పురస్కారంగా టెన్సింగ్ నార్గే ప్రతిమ, ధ్రువపత్రం, బ్లేజర్/ శారీ, రూ.15 లక్షల నగదు బహూకరిస్తారని వివరించారు. అర్జున అవార్డుకు సమానంగా ఈ పురస్కారం ఉంటుందన్నారు. నామినేషన్లను అవార్డ్స్‌జీవోవి.ఐఎన్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో ఈ నెల 30వ తేదీలోగా పంపాలని కోరారు. వివరాలకు ఏలూరులోని సెట్‌వెల్ కార్యాలయ ఫోన్ నంబరు 94909 38012లో సంప్రదించాలని సూచించారు.

రేపు ఎంటీఎస్ టీచర్లకు బదిలీ కౌన్సెలింగ్

ఏలూరు అర్బన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి) : కనీస వేతన స్కేలు (ఎంటీఎస్)పై నియమితులైన సెకండరీ గ్రేడ్ టీచర్ల(ఎస్టీటీ)కు బదిలీల కౌన్సెలింగ్‌ను శుక్రవారం ఏలూరు జడ్పీ మీటింగ్ హాలులో నిర్వహించ నున్నారు. విద్యా సంవత్సరంలో 11 నెలల ఉద్యోగ కాలానికి నియమితులైన ఎస్టీటీలు డీఎస్సీ-1998, డీఎస్సీ-2008 రిక్రూట్‌మెంట్ల నుంచి జిల్లాలో సుమారు 360 మంది పని చేస్తున్న విషయం విదితమే. ప్రస్తుత విద్యా సంవత్సరానికి ఎంటీఎస్ టీచర్లకు నో వర్క్-నో పే విధానాన్ని వర్తింపజేయను న్నారు. ఇటీవలే రెగ్యులర్ హెచ్ఎంలు, టీచర్ల సాధారణ బదిలీలను పూర్తిచేసిన నేపథ్యంలో ఆయా ప్రాథమిక పాఠశాలలకు మంజూరుచేసిన టీచరు పోస్టుల్లో రెగ్యులర్ ఉపాధ్యాయులు విధులు చేపట్టగా, ఇంకా లోటువున్న పాఠశాలల వేకెన్సీల్లో ఎంటీఎస్ టీచర్లను నియమించేలా బదిలీ కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించి మార్గదర్శకాలను పాఠశాల విద్యాశాఖ బుధవారం విడుదల చేసింది.

21 నుంచి ఎన్‌సీసీ శిక్షణ

ఏలూరు అర్బన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి) : ఎన్‌సీసీ కేడెట్లకు వార్షిక శిక్షణను ఈ నెల 21 నుంచి 30వ తేదీ వరకు వట్లూరు సీఆర్ఆర్ కళాశాలలో నిర్వహించనున్నట్టు కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అమిత్‌పాండే తెలిపారు. మొత్తం 450 మంది కేడెట్లు పాల్గొంటారని వివరించారు.

పెళ్లిలో వివాదం.. ఒకరి హత్య


విజయశేఖర్ (ఫైల్)

నరసాపురం రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): పెళ్లిలో సరదాగా వేసే డ్యాన్స్‌తో తలెత్తిన వివాదం ఒకరిని హత్య చేసే వరకు వెళ్లింది. నరసాపురం మండలం కొత్త నవరసపురం గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. గ్రామంలో ఈదా సతీశ్ వివాహం జరిగింది. దీనికి గ్రామానికి చెందిన ఈదా సునీల్‌తో పాటు జవదాల విజయశేఖర్ హాజరయ్యారు. ఈ వివాహ వేడుకలో నిర్వహించిన డ్యాన్స్ ప్రోగాం వల్ల వీరిద్దరి మధ్య మాటామాటా పెరిగి వివాదానికి దారితీసింది. పెళ్లికి వచ్చినవారు సర్దిచెప్పడంతో విజయశేఖర్ ఇంటికి వెళ్లిపోయాడు. తిరిగి రాత్రి బట్టలు మార్చుకుని మళ్లీ వివాహ వేదిక వద్దకు వచ్చారు. అప్పటికే అక్కడ ఉన్న ఈదా సునీల్ ఉదయం జరిగిన గొడవను దృష్టిలో పెట్టుకుని విజయశేఖర్‌పై దాడికి దిగాడు. గోడకేసి బలంగా కొట్టి కత్తితో పొడిచాడు. విజయశేఖర్ కుప్పకూలడంతో సునీల్ అక్కడి నుంచి జారుకున్నాడు. రక్తపుమడుగులో పడిన విజయశేఖర్‌ను కుటుంబ సభ్యులు నరసాపురం ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం కాకినాడ జీసీహెచ్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ విజయశేఖర్ ఉదయం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు సునీల్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నమ్మించి మోసగించాడని మహిళ ఫిర్యాదు

నూజివీడు టౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి తనను నమ్మించి మోసగించాడంటూ నూజివీడు పట్టణానికి చెందిన మహిళ పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలు కొర్ర సోని నూజివీడుకు చెందిన ఎలికె సురేంద్రకు నాలుగేళ్లక్రితం సోషల్ మీడియా ద్వారా పరిచయం ఏర్పడింది. పెళ్లికి పెద్దలను ఒప్పించాలని కోరడంతో తన అమ్మమ్మ వద్దకు వెళ్లి ఉద్యోగం వచ్చిన తరువాత పెళ్లి చేసుకుంటానని హామీ ఇచ్చాడని సోని తెలిపింది. అయితే 2023 అక్టోబరు 10న హైద్రాబాద్‌లో ఉంగరాలు మార్చుకుని ఇదే నిశ్చితార్థం, వివాహమంటూ తనను నమ్మించి మోసం చేశాడని, ఇంట్లో వారిని ఒప్పించి తీసుకెళ్తానని ఆరు నెలల క్రితం నూజివీడు వచ్చి చివరికి ముఖం చాటేశాడంటూ బాధితురాలు వాపోయింది. ఇదే విషయం పెద్దల ముందు పెట్టగా ఉద్యోగం రాలేదని, ఇంట్లోని పెద్దలు ఒప్పుకోవడం లేదంటూ సాకులు చెబుతున్నాడని, మోసపోయానని గ్రహించి ఆత్మహత్యాయత్నం కూడా చేశానంటూ సోనీ పేర్కొంది. తనను వదిలించుకోవాలనే ఉద్దేశంతో బెదిరింపులకు దిగాడని, న్యాయం చేయాలంటూ బాధితురాలు నూజివీడు పట్టణ పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసి పట్టణ పోలీసులు విచారణ చేపట్టారు.



రోడ్డు పక్కన పడిఉన్న బైక్.. జానీ మృతదేహం

రోడ్డు ప్రమాదంలో జ్యోతిష్కుడు మృతి

ఏలూరు క్రైం, జూన్ 18(ఆంధ్రజ్యోతి):జ్యోతిష్యం చెప్పుకుంటూ జీవించే ఒక యువకుడు అర్ధరాత్రి వేళ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పినకడిమి గ్రామానికి చెందిన చేజర్ల జానీ(21) జ్యోతిష్యం చెప్పుకుంటూ జీవిస్తున్నాడు. తనకున్న రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై మంగళవారం అర్ధరాత్రి ఏలూరు అమీనాపేట ఏటిగట్టు రోడ్డులో వెళ్తుండగా మోటార్ సైకిల్ అదుపుతప్పి రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. బుధవారం ఉదయం చూసిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. త్రి టౌన్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మోటారు సైకిల్ అదుపు తప్పి ప్రమాదానికి గురయ్యాడా లేదా ఏదైనా వాహనం ఢీకొట్టిందా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. అయితే ప్రాథమికంగా మాత్రం మోటారు సైకిల్ అదుపుతప్పి ప్రమాదం జరిగినట్టు గుర్తించారు. జానీ తల్లి దుర్గమ్మ త్రిటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కోకో గింజల దొంగల ముఠా అరెస్ట్

రూ.2.15 లక్షల విలువైన 430 కేజీల కోకో గింజలు స్వాధీనం


పోలీసులు అదుపులోకి తీసుకున్న నిందితులు

ఏలూరు క్రైం, జూన్ 18(ఆంధ్రజ్యోతి) : కోకో గింజలను దొంగిలించిన నలుగురిని అరెస్టు చేసి వారి నుంచి 430 కేజీలు స్వాధీనం చేసుకున్నట్టు ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ తెలిపారు. విలేకరుల సమావేశంలో డీఎస్పీ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ చాలా మంది చెడు వ్యసనాలకు బానిసలై సులువుగా డబ్బు సంపాదించాలని రైతులకు నష్టం కలిగించేలా చోరీలకు పాల్పడుతున్నారని అన్నారు. రైతుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు కోకో గింజలు అపహరించిన ఒక ముఠాను అరెస్టు చేశామన్నారు. ద్వారకాతిరుమల మండలం వేంపాడుకు చెందిన ఆలపాటి జగదీశ్ కుమార్ పొలంలో ఈనెల 15న 120 కేజీల కోకో గింజలను దొంగలు అపహరించుకుపోయారని అన్నారు. ఈనెల 17న సాయంత్రం ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెం సంతమార్కెట్ నుంచి వేంపాడు వెళ్ళే మట్టిరోడ్డులో అనుమానాస్పదంగా ఉన్న ద్వారకాతిరుమల మండలం వేంపాడుకు చెందిన గెద్దల నాగరాజును అతనితో పాటు ఉన్న కామవరపుకోట మండలం తడికలపూడి గ్రామానికి చెందిన కొత్తపల్లి హర్ష, జొన్నకూటి రాజేష్, ముదినూరి శివశంకర్‌లను అరెస్టు చేసి వారి నుంచి 430 కేజీల కోకో గింజలు, రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ రెండు లక్షల 15 వేల రూపాయలని తెలిపారు. వీటిని పెదవేగి మండలం చక్రాయిగూడెం గ్రామానికి చెందిన సిరిబత్తుల ఉదయ్‌కుమార్‌కు విక్రయిస్తున్నారని దీంతో అతను కూడా ఈ కేసులో నిందితుడిగా గుర్తించి అరెస్టు చేయడా నికి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. నిందితులను అరెస్టు చేయడంలో చాకచక్యంగా వ్యవహరించిన భీమడోలు సీఐ యు.జె.విల్సన్, ద్వారకాతిరుమల ఎస్ఐ పి.సుధీర్, భీమడోలు హెడ్ కానిస్టేబుల్ ఎస్ శ్రీనివాస్, ద్వారకాతిరు మల కానిస్టేబుళ్ల ఎం వెంకటేశ్వరరావు, సి.హెచ్.లక్ష్మీనారాయణ, విజయ్ ప్రకాశ్ బాబులను డీఎస్పీ అభినందించారు.

బాలికను మోసగించిన కేసులో యువకుడి అరెస్ట్

భీమవరం క్రైం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఒడిశా ప్రాంతానికి చెందిన బాలికను ప్రేమ పేరుతో నమ్మించి మోసం చేసిన ఇద్దరు యువకుల్లో ఒకరిని బుధవారం అరెస్ట్ చేసినట్టు భీమవరం డీఎస్పీ ఆర్.జి.జయసూర్య తెలిపారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన బాలికను రెండేళ్ల క్రితం అదే రాష్ట్రానికి చెందిన బాబుల్ ప్రధాన్ అనే యువకుడు భీమవరం తీసుకొచ్చి సుప్రభాత్ హోటల్‌లో పనికి పెట్టాడు. ప్రేమ పేరుతో నమ్మించి గర్భవతిని చేశాడు. అనంతరం బాబుల్ ప్రధాన్ మొహంచాటేశాడు. అనంతరం అదే హోటల్‌లో పని చేస్తున్న అస్సాం రాష్ట్రానికి చెందిన జగన్నాథ్ పరిచయమయ్యాడు. ఈ యువకుడు కూడా ప్రేమపేరుతో నమ్మించి వశపర్చుకున్నాడు. గత నెల 17న విజయవాడ తీసుకెళ్లి అక్కడ ఒక రూమ్‌లో పెట్టాడు. అదే నెల 20న బాలిక 8 నెలల గర్భవతి అని తెలిసి జగన్నాథ్ అస్సాం రాష్ట్రం ఉడాయించాడు. 29న బాలికకు పురిటినొప్పులు రావడంతో అక్కడున్న స్థానికులు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా ఒక పాపకు జన్మనిచ్చింది. కోలుకున్న అనంతరం 3వ తేదీన పోలీసులు ఒరియాభాష తెలిసిన వ్యక్తిని తీసుకెళ్లి బాలిక నుంచి వివరాలను సేకరించారు. బాలికను భీమవరం తీసుకొచ్చిన బాబుల్ ప్రధాన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. జగన్నాథ్ అనే యువకుడిని అరెస్ట్ చేయాల్సి ఉందని డీఎస్పీ జయసూర్య తెలిపారు.

బస్సులో బంగారు వస్తువులు కాజేసిన మహిళ అరెస్టు

ద్వారకాతిరుమల, జూన్ 18(ఆంధ్రజ్యోతి): బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న ఓ ప్రయాణికురాలి బ్యాగులోని పర్సును తస్కరించిన దొంగను ద్వారకాతిరుమల ఎస్ఐ బుధవారం అరెస్టు చేశారు. గత ఏడాది అక్టోబర్ 26న మండలంలోని ఎం.నాగులపల్లి పరిధిలోని భీమడోలు జంక్షన్‌లో పెరవలి మండలం దేశపాత్రునిపాలేనికి చెందిన మహిళ బొడ్డు నాగమణి బస్సు ఎక్కుతోంది. అదే సమయంలో ఆమె బ్యాగులోని బంగారు వస్తువులను భీమవరంలోని గొల్లవానితిప్పకు చెందిన ముత్యాలమ్మ తస్కరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపిన పోలీసులు ముత్యాలమ్మను పట్టుకుని ఆమె నుంచి 24 గ్రాములకు పైగా బరువైన బంగారు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. గతంలోనూ అనేక చోరీలు చేసి జైలు శిక్ష అనుభవించినట్టు విచారణలో తేలిందని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు మృతి



పెదవేగి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఎదురుగా వచ్చిన లారీ ఢీ కొట్టడంతో ద్విచక్రవాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ముసునూరు మండలం చెక్కపల్లికి చెందిన సికాకొల్లు వెంకట నాగేశ్ ద్విచక్రవాహనంపై బుధవారం సాయంత్రం ఏలూరు వెళ్తుండగా చింతలపూడి నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయమైన వెంకట నాగేశ్(50) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు.



చెట్టుపై ఇరుక్కున్న కారు.. గాయాలపాలైన యువకుడు

అదుపు తప్పిన కారు.. నలుగురికి గాయాలు

ద్వారకాతిరుమల, జూన్ 18(ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యంగా కారును అతివేగంగా నడపడంతో అదుపుతప్పి రోడ్డు మార్జిన్‌లోని చెట్లపై ఇరుక్కుంది. ఈప్రమాదంలో నలుగురికి గాయాలవగా కారు తుక్కుతుక్కయింది. ద్వారకాతిరుమలలోని కుంకుళ్లమ్మ ఆలయ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. భీమవరానికి చెందిన విష్ణు తన అన్న కారును తీసుకుని స్నేహితుడు మనోజ్‌తో కలిసి ఇతర మిత్రులు గణపవరం మండలం పిప్పరకు చెందిన బండారపు మోహన్ వెంకట సాయి, వడ్డీల ప్రభాకర్లను తీసుకుని దైవదర్శనం నిమిత్తం ద్వారకాతిరుమల బయల్దేరారు.ద్వారకాతిరుమల కుంకుళ్లమ్మ ఆలయం దాటిన అనంతరం మలుపులో అతివేగం వల్ల కారు అదుపుతప్పి మార్జిన్‌లో ఉన్న చెట్లపైకి దూసుకెళ్లింది. దీంతో విష్ణు తలకు, చేతికి తీవ్రగాయాలు కాగా మోహన్ ఎడమ చేయి విరిగింది. అలాగే ప్రభాకర్ తలకు గాయాలయ్యాయి. మనోజ్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ సుధీర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మట్టి లారీ కిందపడి రైతు మృతి

ఉంగుటూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): చేలోకి మట్టి తోలించుకుంటున్న రైతుపైకి లారీ ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గోపాలపురం గ్రామానికి చెందిన గాది గంటయ్య(55) అనే రైతు చేబ్రోలు-తల్లాపురం మధ్య ఉన్న పొలంలోకి మట్టి తోలించుకునేందుకు లారీని పురమాయించుకున్నాడు. బుధవారం ఉదయం మట్టి తోలకంలో భాగంగా పొలంలో లారీని రివర్స్ చేస్తుండగా వెనుక ఉన్న గంటయ్యపైకి ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై చేబ్రోలు ఎస్.ఐ. ఎం.సూర్య భగవాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆర్టీసీ బస్ ఢీకొని యువకునికి తీవ్ర గాయాలు

ఏలూరుక్రైం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మోటార్ సైకిల్‌పై వెళ్తున్న ఒకరిని ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కామవరపుకోట మండలం తడికలపూడికి చెందిన ఎం.వెంకటేశ్వరరావు(33) తన మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా బుధవారం తడికలపూడి సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో రెండు కాళ్లూ విరిగిపోగా ఏలూరులోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ఆసుపత్రి ఔట్ పోస్టుపోలీసులకు సమాచారమిచ్చారు.

అగ్ని ప్రమాద బాధిత రైతుకు ఎమ్మెల్యే చింతమనేని సాయం

దెందులూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి):అగ్ని ప్రమాద బాధిత రైతును చింతమనేని ప్రభాకర్ ఆదుకున్నారు. దెందులూరుకు చెందిన ఆకుల మణికంఠకు చెందిన 15 ఎకరాల గడ్డివాము గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు సమస్యల చెప్పడంతో స్పందించిన ఆయన రెండు ట్రాక్కుల గడ్డిని ఉచితంగా రైతు ఆకుల మణికంఠకు బుధవారం అందజేశారు. దీంతో పాటు బాధిత రైతు మణికంఠకు రాయితీపై పశుగ్రాసం అందించాలని పశుసంవర్ధక శాఖ అధికారులకు చింతమనేని సూచించారు.

భూసార పరీక్షలతో రైతులకు మేలు

ఏలూరు రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రైతులు నూతన సాంకేతిక పద్ధతులను అందిపుచ్చుకుని వ్యవసాయ చేయాలని ఏలూరు మండల వ్యవసాయశాఖ అధికారిని ఎ.జీవన సంధ్య సూచించారు. బుధవారం కోనంగి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పాల్గొని సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. రైతులు పంటలు సాగు చేసే ముందు తమ భూముల్లో భూసార పరీక్షలు చేయించుకొని రిపోర్టు ఆధారంగా అనువైన పంటలను సాగు చేసుకోవాలని, రసాయన ఎరువులకు దూరంగా ఉండాలన్నారు.

పాఠశాలల్లో పాఠ్యపుస్తకాల విక్రయంపై ఆందోళన

ఏలూరు అర్బన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు విద్యాసంస్థల ప్రాంగణాల్లోనే పాఠ్యపుస్తకాలు విక్రయిస్తుండటాన్ని బుధవారం ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు అడ్డుకున్నారు. వివరాలను సంఘ జిల్లా కార్యదర్శి లెనిన్ తెలియజేశారు. శాంతినగర్‌లోని రెండు ప్రైవేటు పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలను అధిక ధరలకు విక్రయిస్తుండగా ఏలూరు ఎంఈవో-2 అరుణ్ కుమార్ సమక్షంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు అక్కడకు చేరుకుని అడ్డుకున్నారు. మార్కెట్ ధరలకన్నా 150 శాతం అధికంగా తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. ఆంగ్ల మాధ్యమం పట్ల మోజుతో పిల్లలను ప్రైవేటు పాఠశాలలను ఆశ్రయిస్తుండగా, దీనినే అవకాశంగా మలుచుకుని అధిక ఫీజులు, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం దుస్తులు, ట్యూషన్ ఫీజుల పేరిట వేర్వేరుగా దోచుకుంటున్నాయన్నారు. ఎంఈవో సమక్షంలోనే పాఠ్య పుస్తకాలను సీజ్ చేయించామని, జిల్లా వ్యాప్తంగా దోచుకుంటున్న ప్రైవేటు విద్యా సంస్థలపై డీఈవో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వంశీ, భానుప్రకాశ్, గోపి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి


ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

చింతలపూడి/కామవరపుకోట/బుట్టాయగూడెం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): సీపీఐ ఆధ్వర్యంలో జూలై 5,6,7 తేదీల్లో చింతలపూడిలో జరగనున్న జిల్లా ద్వితీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ నాయకులు, కార్యకర్తలు బుధవారం మోటార్ సైకిళ్ల ర్యాలీలు నిర్వహించారు. జిల్లా మహాసభల ఆహ్వాన సంఘం అధ్య క్షులు మామిళ్ళపల్లి వసంతరావు చింతలపూడి ర్యాలీని ప్రారంభించారు. అనంత రం ఆయన మాట్లాడుతూ చింతలపూడి ఏరియాలో మొట్టమొదటిసారిగా జిల్లా సభలు జరుగుతున్నాయని జయప్రదం చేయాలన్నారు. ర్యాలీలో ప్రధాన నాయకులు పి.సోమశేఖర్, పి.రాజు, టి.బాబు, శ్రీనివాసరావు, మాణిక్యాలరావు, లాజర్ పాల్గొన్నారు. సీపీఐ నాయకుల టి.వి.ఎస్.రాజు, కంకిపాటి బుచ్చిబాబు మాట్లాడుతూ 20న కామవరపుకోట మండల మహాసభను కొత్తూరులోని కోరమండల్ భవనంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కామవరపు కోట నాయకులు కోడిగంటి సోమరాజు, నల్లమోతుల కృష్ణ, జి.దుర్గాప్రసన్న, భీమయ్య పాల్గొన్నారు. బుట్టాయగూడెం మండల కార్యదర్శి చోడెం దుర్గ పిలుపు మేరకు మండల కేంద్రంలో నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో తెల్లం మునేశ్వరావు, మడకం గంగరాజు, కె.సూర్యచంద్రం, బి.ముత్యాలమ్మ,గంగరాజు, సంసోను, కె.రామలక్ష్మీ, రమణ, సాయి, వెంకటేశ్వరావు, రాము పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్ పర్సన్‌గా కారేటి జ్యోతి

ఉంగుటూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్‌గా జనసేన పార్టీకి చెందిన కారేటి జ్యోతి బాధ్యతలు స్వీకరించారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు గౌరవ చైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ చేబ్రోలు మార్కెట్ కమిటీ కార్యాలయంలో నిరాడంబరంగా జరిగింది. వీరి చేత కార్యదర్శి కె.ఆనంద్ ప్రమాణ స్వీకారం చేయించారు. మొత్తం 20 మంది డైరెక్టర్లతో కలిపి వైస్ చైర్మన్‌గా కూనసాని నాగేశ్వరరావు కూడా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ ఎమ్మెల్యే ధర్మరాజు సహకారంతో రైతు సమస్యల పట్ల అవ గాహన పెంచుకుని పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. టీడీపీ, జనసేన నాయకులు వేములపల్లి సుధీర్, పంది రాంబాబు, శరణాల మాలతీరాణి, పాతూరి విజయ కుమార్, కడియాల రవిశంకర్, చేబ్రోలు సర్పంచి, ఉప సర్పంచ్‌లు పాల్గొన్నారు.

21న వైఎంహెచ్‌ఏలో యోగా దినోత్సవం

ఏలూరు రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): హిందూ యువజన సంఘం వైఎంహెచ్ ఆధ్వర్యంలో 121 సంవత్సరాల ఉత్సవాల్లో భాగంగా ఈనెల 21వ తేదీన ప్రపంచ యోగా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు సంస్థ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షులు యర్రా సోమలింగేశ్వరరావు, ఇన్‌చార్జీ ప్రధాన కార్యదర్శి డా.గుడిపాటి లలితాశర్మ, కార్యదర్శి మజ్జి కాంతారావు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాల్లో భాగంగా 21న శనివారం వైఎమ్‌హెచ్ హాలులో ఉదయం 7గంటల నుండి 8:30 గంటల వరకు వేణుగోపాల్ లునాని, పి సాంబశివరావులచే దత్త క్రియ యోగాలో శిక్షణ అందిస్తారు అన్నారు. ప్రాణాయామములు, ధ్యానము, ఆసనాలు, సూర్యనమస్కారాలు తదితర అంశాలలో శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు.

22న అన్నమాచార్యుల సంగీత గానం

ఏలూరు రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): స్థానిక గరికపాటి ఆర్ట్స్ థియేటర్స్ 275వ కార్యక్రమములో భాగంగా ఈనెల 22వ తేదీన స్థానిక రామకృష్ణాపురంలోని సాహిత్యమండలి ప్రాంగణంలో సాయంత్రం శాస్త్రీయ, చలనచిత్ర గాయకురాలు ముక్కామల శ్రీవల్లిచే అన్నమాచార్య సంకీర్తనల గానం ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ నిర్వాహకులు గరికపాటి కాళీదాసు ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం సీనియర్ శాస్త్రీయ సంగీత విద్వాంసులు, ముక్కామల భామామణికి ఆత్మీయ సత్కారం చేయనున్నట్లు తెలిపారు. కళాభిమానులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సాహిత్య మండలి ప్రధాన కార్యదర్శి పుల్లాబోట్ల పురుషోత్తమరావు విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

జీలుగుమిల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ధర్తీ ఆబా ఉత్కర్ష్ అభియాన్, పీఎం-జన్మన్ ప్రచార కార్యక్రమంలో భాగంగా అంకన్నగూడెంలో గిరిజనులకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహనకు గ్రామసభ నిర్వహించారు. ఈ శిబిరంలో ఐటీడీఏ పీవో రాములు నాయక్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలతో పాటు గిరిజనుల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఆధార్ నమోదు, హెల్త్ కార్డులు, టీబీ, సికిల్‌సెల్ స్క్రీనింగ్, పౌష్టికాహార కిట్లు అందజేశారు. ఎంపీడీవో టి.నిఖిల్ మధుశరణ్, తహసీల్దారు ఉదయ్ భాస్కర్, ఐసీడీఎస్ సూపర్‌వైజరు వెంకటలక్ష్మీ, ఎపీవో జాన్‌వెస్లీ, హౌసింగ్ ఏఈ ప్రసాద్, పీఆర్ ఏఈ రామాంజనేయులు, జడ్పీటీసీ ఎం.వసంత్, సర్పంచ్ పి.ముత్యాలమ్మ, అధికారులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

కొయ్యలగూడెం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కొయ్యలగూడెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. బుధవారం స్థానిక మండల పరిషత్ సర్వసభ్య మండల పరిషత్ సమావేశహాలులో ఎంపీపీ గంజిమాల రామారావు అధ్యక్షతన సమావేశం జరిగింది.ఈ సందర్భంగా మండలంలోని పలు సమస్యలను సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. తహ సీల్దార్ నాగరాజు మాట్లాడుతూ రేషన్ సరుకుల పంపిణీలో ఏమైన సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. 21న జరిగే అంత ర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎంపీడీవో కిరణ్, వైస్ ఎంపీపీ గంగరాజు పాల్గొన్నారు.

కొల్లేరు కాలుష్యంపై మీరేం చేశారు?

(ఐదో పేజీ తరువాయి)

మరమ్మతులకు రూ.3 కోట్లు మంజూరు చేస్తే, అభయారణ్య పరిధిలోకి వస్తుందని పనులే చేపట్టని విషయాన్ని ఆయన కమిటీ దృష్టికి తీసుకువెళ్లారు. వన్య ప్రాణి అభయారణ్యం అభివృద్ధికి ఏ చర్యలు తీసుకోలేదని, కొల్లేరు ఆపరేషన్‌లో భూములు కోల్పోయిన వారికి న్యాయం చేయాలని ఆయన కోరారు.

కమిటీ తిరుగు ప్రయాణం : జిల్లాలో రెండు రోజులపాటు పర్యటించిన కేంద్ర సాధికార కమిటీ బృందం అన్ని అంశాలను సాధ్యమైనంత మేర స్పృశించే ప్రయత్నం చేసింది. రెండో రోజు బుధవారం జరిగిన సమీక్షలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, అటవీ శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంతరాము, కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ అజయ్‌కుమార్ నాయక్, ఎస్పీ కిశోర్, డీఎఫ్‌వోలు శుభం, విజయ, ఆర్డీవో అంబరీశ్ పాల్గొన్నారు. సాధికార కమిటీ సభ్యులను సాగనంపుతూ వారందరిని కలెక్టర్ సత్కరించారు.

జగన్ రీసర్వే మాయాజాలం!

(ఐదో పేజీ తరువాయి)

ఇద్దరు పిల్లలు కలిగి ఉండి అర్హత ఉన్నప్పటికీ తల్లికి వందనం అనర్హుల జాబితాలోనే మిగిలిపోయారు. పెయ్యేరులో శాంతి అనే మహిళ పేరున విద్యుత్ మీటరు లేకపోయినా ఆ కుటుంబం సగటును 300 యూనిట్ల విద్యుత్‌ను వినియోగిస్తున్నట్టు ఆన్‌లైన్‌లో చూపించి తల్లికి వందనం జాబితాలో అనర్హురాలిగా పేర్కొన్నారు. ఆమె బుధవారం ఆ పాఠశాలకు వచ్చి హెచ్‌ఎంను కలిసి తనకు తల్లికి వందనం సొమ్ము బ్యాంకు ఖాతాలో జమ కాలేదని చెప్పగా దీనిపై ఆరాతీస్తే విద్యుత్ వినియోగం ఎక్కువ ఉన్నట్లు తప్పుగా నమోదైనట్టు తెలిసింది.




ద్వారకాతిరుమల మోడల్ స్కూల్లో కిట్ల పంపిణీ దృశ్యం... రంగాపురంలో, తెడ్లంలో బుక్స్ అందజేస్తున్న నాయకులు


ట్రై సైకిల్ అందజేస్తున్న ఎమ్మెల్యే చంటి

పాఠశాలల్లో విద్యా కిట్ల పంపిణీ

ఏలూరుటూటౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆదర్శవంతమైన పాలన కొనసాగుతోందని ఎమ్మెల్యే బడేటి చంటి పేర్కొన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం విభిన్న ప్రతిభావంతులకు ట్రై సైకిళ్ల పంపిణీ చేశారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ విభిన్నప్రతిభావంతుల్ని ఆదుకోవల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. ఇచ్చిన హామీ మేరకు సూపర్-6 పథకాలు అమలు చేస్తున్నామన్నారు. త్వరలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు.

● ద్వారకాతిరుమల: నాణ్యతా ప్రమాణాలతో ఉన్న విద్యాకిట్లను అందజేసి మంత్రి లోకేశ్ తనదైన ముద్ర వేసుకున్నారని మాజీ జడ్పీటీసీ మొగతడకల లక్ష్మీరమణి అన్నారు.ద్వారకాతిరుమల మోడల్ స్కూల్లో బుధవారం ఆమె విద్యామిత్ర కిట్లను పాఠశాల విద్యార్థులకు అందజేశారు. గత ప్రభుత్వం పంపిణీ చేసిన వాటికంటే ఇవి ఎంతో నాణ్యతగా ఉన్నాయన్నారు. సర్పంచ్ స్వర్ణలత నేతలు మటపర్తి బద్రి తదితరులు పాల్గొన్నారు. అలాగే తిమ్మాపురం జడ్పీ పాఠశాలలో సర్పంచ్ ఎర్రగొల్ల రజని, టీడీపీ గ్రామాధ్యక్షుడు ఘంటా శ్రీనివాసరావు, ఆచంట సత్యనారాయణ, వి.ధర్మయ్య, ఏపూరి కిషోర్ చేతుల మీదుగా విద్యార్థులకు కిట్లు అందజేశారు.

● లింగపాలెం: విద్యార్థులకు తల్లికి వందనం అందించి వారి చదువులకు సీఎం చంద్రబాబు భరోసా కల్పించారని రంగాపురం సర్పంచ్ మునునూరి రాము అన్నారు. మండలంలోని రంగాపురం హైస్కూల్లో సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ అమ్మకు వందనం పథకంతో అన్ని కుటుంబాల్లో వెలుగులు నిండాయని అన్నారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటరత్నం, కె.గోకవరం సర్పంచ్ యలమంచి శ్రీనివాసరావు, ఓబిళ్లనేని శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలోని పలు పాఠశాలల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్ పాఠ్య పుస్తకాలను బుధవారం పంపిణీ చేశారు. కైకరం హైస్కూల్లో వద్యా కమిటీ చైర్మన్ అల్లూరి జగన్మోహిని కొత్తూరు పాఠశాలలో సర్పంచ్ సలగాల గోపి, ఎంపీటీసీ చెన్ను సత్యవాణి ఉంగుటూరు పాఠశాలలో చైర్మన్ వల్లభని ప్రసాద్‌ల చేతుల మీదుగా కిట్లను పంపిణీ చేశారు.

● జంగారెడ్డిగూడెం: మండలంలోని మంగిశెట్టిగూడెంలో ఎంపీ యూపీ పాఠశాల విద్యార్థులకు బుధవారం విద్యామిత్ర కిట్లు పంపిణీ చేశారు. టీడీపీ సీనియర్ నాయకుడు మధ్యాహ్నపు సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి లోకేశ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఉప సర్పంచ్ కొడవటి వెంకటేశ్వరరావు, పాపోలు శ్రీనివాసరావు, రూపా సుధాకర్ బాబు, ఉప్పునూతల శ్రీనివాసరావు, కనికళ్ల శ్రీనివాసరావు, నల్లగోపు చిరంజీవి, జనసేన నాయకుడు ఓరుగంటి శ్రీనివాసరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు. తాడువాయి ఎంపీపీ పాఠశాలలో ఉపసర్పంచ్ వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు ఎస్.ఎస్.ఇస్మాయిల్, కె.శ్రీనివాసరావు, కె.నారాయణ, హెచ్‌ఎం టి.చెల్లమ్మ, శివరాం మాస్టారు పాల్గొన్నారు.

● టి.నర్సాపురం: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉత్తమ ఫలితాలు సాధించాలని టీడీపీ నాయకులు కేతిరెడ్డి వీరారెడ్డి(చినబాబు) తెలిపారు. తెడ్లం మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు బుధవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వం అందించే సౌకర్యాలు వినియోగించుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఎస్‌ఎంసీ చైర్మన్ నవీన్, గంజి స్టీఫెన్ పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామి కావాలి : గారపాటి చౌదరి


సమావేశంలో మాట్లాడుతున్న గారపాటి చౌదరి

పెదపాడు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి(తపన చౌదరి) అన్నారు. వసంతవాడ గ్రామంలో వికసిత్ భారత్ సమావేశాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షులు చౌటపల్లి విక్రమకిశోర్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి చౌదరి మాట్లాడుతూ పేదల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ప్రధాని మోదీ పథకాలు అమలు చేస్తున్నారని, అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందేలా బీజేపీ చర్యలు తీసుకుంటుందన్నారు. బీజేపీ జిల్లా ఇంచార్జి నెక్కంటి శ్రీనివాసరావు, గుమ్మడి చైతన్య, మండల పార్టీ అధ్యక్షులు పామర్తి రంగారావు, బొత్స శేఖర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● లింగపాలెం: దేశాన్ని అభివృద్ధిలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని బీజేపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్ అన్నారు. ముడిచర్లలో మండలాధ్యక్షుడు పరసా కిషోర్ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్పసభ నిర్వహించారు. పేదల సంక్షేమానికి కేంద్రం అనేక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. రాష్ట్రకార్యవర్గ సభ్యుడు రాయంకుల చక్రధరరావు, చింతలపూడి నియోజకవర్గ అసెంబ్లీకన్వీనర్ ఒంటెద్దు యేసు వరప్రసాద్, కె.వి.ఎస్ వరప్రసాద్, సాయికృష్ణ, ప్రవీణ్‌కుమార్, సత్యనారాయణ, సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దంతవైద్య కళాశాలకు ఉత్తమ స్థానం

పెదవేగి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఇండియన్ సొసైటీ ఆఫ్ పెరియో డోంటాలజీ ఆధ్వర్యంలో రాజమండ్రి జీఎస్‌ఎల్ దంతవైద్య కళాశాలలో నిర్వహించిన పోస్ట్ గ్రాడ్యుయేషన్ కాన్ఫరెన్స్ ఐఎస్‌పీ ఇంటిగ్రేట్ 2025లో పెదవేగి మండలం దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాలకు చిగుళ్లవ్యాధి విభాగంలో ద్వితీయస్థానం లభించింది. బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పీజీ దంత వైద్యవిద్యార్థులను కరస్పాండెంట్ ఫాదర్ మోజెస్ అభినందించారు. రాజమండ్రి జీఎస్‌ఎల్ దంతవైద్య కళాశాలలో ఇటీవల పోస్ట్ గ్రాడ్యుయేషన్ కాన్ఫరెన్స్ ఐఎస్‌పీ ఇంటిగ్రేట్ 2025 నిర్వహించారు. నిర్వహించిన క్విజ్ పోటీల్లో సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాల పోస్ట్ గ్రాడ్యుయేషన్ బృందం పాల్గొనగా ద్వితీయ స్థానంలో నిలిచి, ప్రశంసా పత్రంతో పాటు నగదు పురస్కారం అందుకున్నారు. కరస్పాండెంట్ ఫాదర్ మోజెస్ చిగుళ్లవ్యాధి విభాగాధిపతి పి.అరవింద్‌కుమార్, డాక్టర్ పి.హరీష్ ప్రభుదేవ్, డాక్టర్ కిషోర్, పీజీ దంతవైద్య విద్యార్థులు వి.అంజలి, కె.మౌనీష, కె.దివ్యలను అభినందించారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి

యోగాంధ్రలో భాగస్వామ్యం కావాలి

ప్రజలకు మాజీ ఎమ్మెల్యే ఘంటా పిలుపు

కామవరపుకోట, జూన్ 18(ఆంధ్రజ్యోతి): యోగాను నిత్య జీవితంలో భాగం చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ పేర్కొన్నారు. బుధవారం కామవరపుకోట మండలం గుంటుపల్లి పంచాయతీలోని జీలకర్రగూడెం గట్టు వద్ద ఉన్న పర్యాటక ప్రాంతంలో యోగాసనాలు వేశారు. ఐటీడీఏ పీవో రాములు నాయక్ మాట్లాడుతూ యోగాంధ్రలో భాగంగా జిల్లాలోని నాలుగు ప్రముఖ పర్యాటక కేంద్రాల్లో యోగాభ్యసాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. డీఆర్డీఏ పీడీ ఆర్.విజయరాజు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ నేతృత్వంలో 21 నుంచి యోగాంధ్ర కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.తహసీల్దార్ గెడ్డం ఎలీషా, ఎంపీడీవో సరళకుమారి, ఏవో సత్యవేణి, ఎంఈవో డి.సుబ్బారావుతో పాటు పలు శాఖలకు చెందిన ఉద్యోగులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

వేరొకరి అకౌంట్‌కు తల్లికి వందనం

సరిచేయించిన అధికారులు..

జంగారెడ్డిగూడెం,జూన్ 18(ఆంధ్రజ్యోతి): లక్కవరం గ్రామంలో సాంకేతిక లోపంతో ఒక తల్లి ఖాతాలో జమ కావలసిన తల్లికి వందనం పథకం నగదు మరొక తల్లి ఖాతాలో జమైంది. లక్కవరానికి చెందిన బొప్పి నీడు నాగదేవికి ఇద్దరు పిల్లలుండగా నాలుగు రోజుల క్రితం నాగదేవి అకౌంట్‌కు ముగ్గురి పిల్లల నగదు రూ.39 వేలు జమైంది. అదే గ్రామానికి చెందిన దల్లి హేమకు ఇద్దరు పిల్లలుండగా ఒకరికి మాత్రమే రూ.13 వేలు నగదు జమైంది. ఈ విషయాన్ని లక్కవరం హెచ్‌ఎం జి.దుర్గారావు, ఎస్‌ఎంసీ చైర్మన్ డి.దుర్గారావు సహకారంతో స్థానిక సచివాలయంలో ఫిర్యాదు చేయగా సమస్య పరిష్కరించారు.ఆ నగదును విత్‌డ్రా చేసి బుధవారం హేమకు అందచేశారు.

ఇరువురికి గాయాలు... చికిత్స

ఉంగుటూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ఉంగుటూరు వద్ద రోడ్డు దాటుతున్న సమయంలో రెండు మోటార్ సైకిళ్ల ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సైక్లిస్టులు ఎస్.కే.కరీముల్లా, ఎన్ వెంకటేశ్వరరావులు గాయపడగా అంబులెన్స్‌లో చికిత్స చేశారు.

వన సంరక్షణ సమితికి ఆదాయం పంపిణీ


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

పెదవేగి, జూన్ 18(ఆంధ్రజ్యోతి) : ఏలూరు అటవీ డివిజన్, ఏలూరు రేంజ్ పరిధిలో రామశింగవరం రిజర్వ్ ఫారెస్ట్‌లో కొండలరావుపాలెం వన సంరక్షణ సమితికి వచ్చిన జామాయిల్ ఆదాయం రూ.30,12,651 చెక్కును దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సమితి సభ్యులకు బుధవారం అందించారు. రామశింగవరం రిజర్వ్ ఫారెస్ట్‌కు సంబంధించి కొండలరావుపాలెంలో 2004లో 14 హెక్టార్ల విస్తీర్ణంలో వన సంరక్షణ సమితి ఆధ్వర్యంలో అటవీ శాఖాధికా రులు జామాయిల్ మొక్కలు నాటించారు. వాటిని 2023-24ఆర్థిక సంవత్సరంలో నరికి విక్రయించగా 1333.63 మెట్రిక్ టన్నులకు ఆదాయం రూ.73,48,301 వచ్చినట్టు తెలిపారు. చెక్కులను దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ చేతుల మీదుగా అటవీశాఖాధికారులు వన సంరక్షణ సమితి సభ్యులకు ఇప్పించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ 20ఏళ్ల కిందట మొక్కలు నాటి వదిలేస్తే ఇప్పుడు ఆదాయం ఇంటికొచ్చిందన్నారు. వన సంరక్షణ సమితి సభ్యులు పాలడుగు నరసింహారావు, కరెడ్ల సత్యనారాయణ, తిరువీధుల దేవి, డింగు శ్రీనివాసరావు, మట్టా నాగేశ్వరరావు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ మంచినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా మండల పరిషత్ సర్వసభ్య సమావేశం


సమావేశంలో పాల్గొన్న సర్పంచ్‌లు, అధికారులు

నిడమర్రు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో విజయకుమారి తెలిపారు. బుధవారం నిడమర్రు మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ ధనకొండ ఆదిలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని సమస్యలపై చర్చించారు. ఎనికేపల్లి సర్పంచ్ పుప్పాల మేరి మాట్లాడుతూ మండల పరిషత్ నిధులన్ని గ్రామాలకు సమన్యాయంగా కేటాయించాలని కోరారు. భువనపల్లి సర్పంచ్ కిలారి సత్యవతి రవిబాబు మాట్లాడుతూ గ్రామంలో సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలన్నారు. మండలపర్రు సర్పంచ్ లక్ష్మీ త్రిమూర్తురాజు గ్రామ సమస్యలను ప్రస్తావించారు.సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కామవరపుకోట, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో సరళకుమారి తెలిపారు. మండలంలోని పలు శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు తమ శాఖల ప్రగతి నివేదికలను ఈ సమావేశంలో వివరిస్తారని, సభ్యులు ప్రవేశపెట్టిన అంశాలపై చర్చలు జరుగుతాయని ఎంపీడీవో తెలియచేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఏలూరు రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఆర్‌ఆర్‌పేట సెక్షన్ పరిధిలో చెట్లు నరికివేత, లైన్ మరమ్మతుల నిమిత్తం గురువారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.ఎం.అంబేద్కర్ తెలిపారు. అశోక్‌కుమార్ సబ్‌స్టేషన్ పరిధిలోని పోలీస్ క్వార్టర్స్, ఎస్పీ ఆఫీసు పరేడ్ గ్రౌండ్ అమీనపేట ఏటిగట్టు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

జీలుగుమిల్లి మండల పరిధిలో..

జీలుగుమిల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): పి.నారాయణపురం నుంచి రౌతుగూడెం వరకు జాతీయ రహదారి మరమ్మతులను పురస్కరించుకుని గురువారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు జంగారెడ్డిగూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. పి.నారాయణపురం, పి.అంకంపాలెం, కామయ్యపాలెం, టేకూరు గ్రామాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు రైతులు సహకరించాలని కోరారు.

రేపు భీమడోలు సబ్ స్టేషన్ పరిధిలో..

భీమడోలు: భీమడోలు సబ్ స్టేషన్ పరిధిలో స్తంభాల వైర్ల మార్పిడి వంటి పనుల కారణంగా శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారి అంబేద్కర్ పేర్కొన్నారు. ఉదయం 8నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆగడాలలంక, ఎం నాగులపల్లి, సూరప్పగూడెం, భీమడోలు బస్టాండ్ ఏరియా, పోలసానపల్లి, ఆగడాలలంక సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

నిడమర్రు జూన్ 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కల్పిస్తు సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని పెదనింద్రకొలను సర్పంచ్ ముగ్గళ్ల యాకోబు అన్నారు. బుధవారం పెదనింద్రకొలను నెం.1 మోడల్ ప్రైమరీ స్కూల్లో విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర కిట్లు పంపిణీ చేశారు. ఎంపీటీసీ చినిమిల్లి నరసింహమూర్తి, భీమేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ మేకా వెంకటరమణ, టిడీపీ నాయకులు పొట్నూరి సింహాచలం, పచ్చాకుల వాసు, అయితం ప్రసాద్, హెచ్.ఎం. ఆర్.వి. ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండల విస్తరణాధికారిగా ఎ.సుందరి



లింగపాలెం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): లింగపాలెం మండల విస్తరణాధికారిగా ఎ.సుందరి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో కె.వాణి, సుగుణ రాజు, పాపయ్య పలువురు పంచాయతీ కార్యదర్శులు ఆమెకు శాలువాకప్పి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపీడీవో కె.వాణి, పంచాయతీ కార్యదర్శులు, ఇతర అధికారులలో సమన్వయం చేసుకుంటూ మండలాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకువెళ్లేలా కృషి చేస్తానని తెలిపారు. కాగా భీమడోలు నుంచి బదిలీపై ఆమె ఇక్కడికి వచ్చారు.


గొడౌన్ వద్దకు వేసిన రోడ్డు

ఎరువుల గొడౌన్ ప్రారంభానికి లైన్‌క్లియర్

ద్వారకాతిరుమల, జూన్ 18(ఆంధ్రజ్యోతి): అధ్వానంగా ఉన్న రోడ్డు కారణంగా సి.హెచ్.పోతేపల్లిలో మూతపడిన సొసైటీ ఎరువుల గొడౌన్ త్వరలో రైతులకు అందుబాటులోకి రానుంది. ఈ మేరకు మండలంలోని జి.కొత్తపల్లి సొసైటీ పరిధిలోని రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోంది. సరైన రోడ్డు లేని కారణంగా ఈ సొసైటీ గొడౌన్ గత ఐదేళ్లుగా మూసివేశారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు చొరవతో రహదారిని గ్రావెల్‌తో ముందస్తుగా రవాణాకు అనువుగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జి.కొత్తపల్లి సొసైటీ పెట్రోల్ బంక్‌ను గత కొద్దిరోజుల క్రితం ప్రారంభించామన్నారు.



సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ద్వారకాతిరుమల, జూన్ 18(ఆంధ్రజ్యోతి): దశాబ్దం నాటికల ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు కృషితో సాకారమైందని నేతలు పోలిన శ్రీను, ఘంటా శ్రీను, ఆచంట సత్యనారాయణ, సర్పంచ్ రజని పేర్కొన్నారు. ఈ మేరకు తిమ్మాపురంలో రామాలయం నుండి ప్రధాన రహదారి వరకూ రూ.40 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి.

సర్వీస్ రోడ్లు పూర్తి చేయాలి

టి.నర్సాపురం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): గ్రీన్ ఫీల్డ్ హైవేకి ఇరువైపులా సర్వీస్ రోడ్లు పూర్తి చేయాలని స్వచ్ఛసేవా చారిటబుల్ ట్రస్ట్ అధినేత పెండ్యాల అభిషేక్ బాబు కోరారు. బొర్రంపాలెం సమీపంలోని గ్రీన్‌ఫీల్డ్ హైవే సర్వీస్ రోడ్డు స్థానికులతో కలిసి ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రా, తెలంగాణను కలుపుతూ నిర్మించే గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు పూర్తికావచ్చిందన్నారు. టి.నర్సాపురం నుంచి బొర్రంపాలెం గ్రామాల పరిసరాల ప్రజలు, రైతులు, వ్యాపారులు గ్రీన్‌ఫీల్డ్ హైవే పైకి ఎక్కే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు స్పందించి సర్వీసు రోడ్డు పూర్తి చేయడానికి కృషి చేయాలని ఆయన కోరారు.

పేద కుటుంబానికి సాయం

టీ.నర్సాపురం, జూన్18(ఆంధ్రజ్యోతి): తెడ్లం గ్రామంలో బచ్చు ఏసు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఏసు కుటుంబానికి కేతిరెడ్డి సీతారామరెడ్డి, చంద్రకాంతమ్మ చారిటబుల్ ట్రస్ట్ తరఫున వారి కుమారుడు కేతిరెడ్డి వీరారెడ్డి, సర్పంచ్ ముప్పన శ్రవంతి రమేశ్ బుధవారం కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం చేసి మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా గుణం కలిగి ఉండాలన్నారు.

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి

లింగపాలెం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులంతా తప్పని సరిగా ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.ప్రదీప్ కుమార్ తెలిపారు. రైతులకు పచ్చిరొట్ట ఎరువులు, భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. కౌలురైతు కార్డులను ఎలా ఉపయోగించుకోవాలో తెలియజేశారు. రైతులు రసాయన ఎరువులు తగ్గించాలని సేంద్రియ ఎరువులను వాడాలని సూచించారు.

లక్ష్మీ గణపతికి పూజలు

ఏలూరుకార్పొరేషన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి) : సత్రంపాడులోని లక్ష్మీగణపతి స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణేష్ నామ స్తోత్రాలను పఠించారు. తొలుత ఆలయ అర్చకులు రెండుచింతల రాఘవేంద్రశర్మ స్వామివారికి పంచామృతాభిషేకం జరిపి అనంతరం విశేష అలంకరణ నిర్వహించి ప్రత్యేక హారతులిచ్చారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సి.హెచ్. చిననాగేశ్వరరావు, సిబ్బంది భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు.

దీక్షల తాత్కాలిక విరమణ

బుట్టాయగూడెం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఏజేఏసీ ఆధ్వర్యంలో ఆదివాసీలు మండల కేంద్రంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు బుధవారం తాత్కాలికంగా విరమిస్తున్నట్లు జేఏసీ నాయకుడు సోడెం ముక్కయ్య తెలిపారు. ప్రభుత్వం నాయకులను చర్చలకు ఆహ్వానించడంతో పాటు ఆదివాసీల డిమాండ్లపై సానుకూలంగా స్పందించినందున దీక్షలను నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. 35 రోజులుగా దీక్షల్లో పాల్గొన్న నాయకులకు, సహకారం అందించిన ఆదివాసీలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కొల్లేరు సమావేశానికి తరలివెళ్లిన ప్రజలు

నిడమర్రు జూన్ 18(ఆంధ్రజ్యోతి): కొల్లేరు ప్రజలు గడపకో మనిషి చొప్పున తరలివెళ్లి తమ సమస్యలు వినిపించారు. బుధవారం ఏలూరు జడ్పీ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన కొల్లేరు కేంద్రకమిటీ పరిశీలనా సమావేశానికి నిడమర్రు మండలం నుంచి భారీగా జనం తరలివెళ్లారు. మండలంలో తోకలపల్లి, బైనేపల్లి, ఆముదాలపల్లి, పెదనింద్రకొలను, చిన నింద్రకొలను, నిడమర్రు గ్రామాలకు చెందిన సుమారు 900 మంది తరలివెళ్లారు. ముఖ్యంగా తోకలపల్లి, బైనేపల్లి, ఆముదాలపల్లి గ్రామాలకు తరలివెళ్లారు. ఆయా గ్రామ సర్పంచ్‌లు , ఎంపిటీసిలు, తెలుగుదేశం, జనసేన నాయకులు పాల్గొన్నారు.

రావులపర్రు వంతెన పనులు వేగవంతం

ఉంగుటూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రావులపర్రు వెళ్లే రహదారిలోని వంతెన కూలడంతో కూటమి ప్రభుత్వం నిర్మాణ పనులు వేగవంతం చేసింది. విడుదలైన రూ.80 లక్షలతో పనులు చురుకుగా సాగుతున్నాయి. కాంక్రీటు దిమ్మ వేసి వంతెన పనులు జరుపుతున్నారు. ఆర్‌అండ్‌బీ ఏ.ఈ.భాస్కర్ పర్యవేక్షణలో ఈ వంతెన నిర్మాణం సాగుతోంది. దీని నిర్మాణం మూలంగా నాలుగు గ్రామాలకు దగ్గర మార్గం ఏర్పడుతుందని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు.



కలిదిండి ఎంపీడీవోగా ఫణీంద్ర

కలిదిండి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కలిదిండి ఎంపీడీవోగా ఆర్.ఫణీంద్ర బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కైకలూరు ఎంపీడీవోగా పని చేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. రెగ్యులర్ ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన ఫణీంద్రకు ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, జడ్పీటీసీ బొర్రా సత్యవతి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

రైతులకు రుణ పరిమితి పెంపుపై హర్షం

చాట్రాయి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులకు 2025-26 ఖరీఫ్, రబీ సీజన్లలో సాగుకు రుణ పరిమితి పెంచుతూ బ్యాంకర్ల కమిటీ నిర్ణయం తీసుకోవటం పట్ల బీజేపీ నాయకులు హర్షం వ్యక్త చేశారు. వ్యవసాయ, ఉద్యాన పంటలు, పట్టు, పాడి పశువులు, కోళ్ళు, చేపలు, రొయ్యల పెంపకానికి, వ్యవసాయ అనుబంధ రంగాలకు మేలు జరుగుతుందన్నారు. బీజేపీ నాయకులు నెక్కలపు వెంకటేశ్వరరావు, కొత్తగుండ్ల రమేష్, ఆదిమూలం నాగమోహన శర్మ, బజ్జూరి గోపీకృష్ణ, ఎం. వెంకటేశ్వరరావు, విద్యాధరరెడ్డి, మధు హర్షం వ్యక్తం చేశారు.

ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తాం

పెదవేగిలో పరిశోధన కేంద్రాన్ని సందర్శించిన మంత్రి నాదెండ్ల



మొక్క పెరుగుదలపై వివరిస్తున్న ఆయిల్‌పామ్ పరిశోధన సంస్థ డైరెక్టర్

పెదవేగి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణానికి అనువుగా ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తోందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఈ ఏడాది 15 వేల హెక్టార్ల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగును విస్తరింప చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళికను సిద్ధం చేసిందని ఆయన తెలిపారు. పెదవేగిలోని జాతీయ ఆయిల్‌పామ్ పరిశోధనా సంచలనా లయాన్ని స్థానిక ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, జేసీ పి.ధాత్రిరెడ్డితో కలిసి, మంత్రి నాదెండ్ల మనోహర్ బుధవారం సందర్శించారు. పరిశోధనా కేంద్రం, శాస్త్రవేత్తలు, రైతులు, పామా యిల్ సంస్థల ప్రతినిధులు, ప్రొఫెసర్లతో మంత్రి చర్చించారు. అధిక దిగుబడులను అందించే కొత్త వంగడాలు, కోకో వంటి అంతర పంటలపై అవగాహన, డెల్టా భూముల్లో ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించడం, ఆయిల్‌పామ్‌లో యాంత్రీకరణ వంటి వాటిపై సమీక్షించారు. మంత్రి మాట్లాడుతూ పెదవేగిలో ఉన్న జాతీయ ఆయిల్‌పామ్ పరిశోధనా కేంద్రం దేశంలోనే ఉన్నతమైన స్థానంలో ఉందన్నారు. 250 ఎకరాల్లో విస్తరించిన ఈ పరిశోధనా స్థానంలో పంటల పరిశోధన, టిష్యూ కల్చర్ వంగడాల తయారీ వంటివి జరుగుతున్నాయని చెప్పారు. అధిక దిగుబడు లనిచ్చే వంగడాల తయారీపై శాస్త్రవేత్తలు నిమగ్నమయ్యారని ఆయిల్‌పామ్ పరిశోధనా సంస్థ డైరెక్టర్ డాక్టర్ కంచెర్ల సురేష్ వివరించారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సాగు సమస్యలు, మద్దతు ధర వంటి అంశాలను మంత్రికి వివరించారు. పంటల సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో క్షేత్రస్థాయిలో వాస్తవ సమాచారం అందరితో పంచుకోవడంలో జాప్యం కనిపిస్తోందని దీనిని పరిష్కరిం చేందుకు జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయిలో మోనటరింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, రైతు సహాయ కేంద్రంలో సిబ్బంది, క్షేత్రస్థాయిలో పర్యటించే హార్టికల్చర్ విస్తరణాధికారులతో పాటు ఐదు కంపెనీల ప్రతినిధులు, పెదవేగిలోని ఆయి ల్‌పామ్ పరిశోధనాకేంద్రం సహకారంతో శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణ యిం చామని మంత్రి వివరించారు. నెలనెలా సమావేశం ఏర్పాటుచేసి, సమస్యల పరి ష్కా రానికి చర్యలు తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వం ఆయిల్‌పామ్‌కు ఒక్క రూపాయి కూడా రాయితీ ఇవ్వకుండా రైతులను మోసం చేసిందని, రూ.54 కోట్లు బకాయి పెట్టి, ఆయిల్‌పామ్ ప్రొడ్యూసర్లను మోసం చేసిం దని తెలిపారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. జిల్లా ఉద్యానశాఖాధికారి ఎస్.రామ్మోహన్, శాస్త్రవేత్తలు, పామా యిల్ కంపెనీల ప్రతినిధులు, రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

'పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచండి'

ముదినేపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నూతన బడుల వ్యవస్థలో ఏర్పడిన మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో ఒకటో తరగతిలో విద్యార్థులను చేర్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయ రామరాజు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి మోడల్ ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతిలో 20 మంది కొత్త విద్యార్థులను చేర్పించాలని, పాఠశాలలో 60 మంది విద్యార్థులు తగ్గకుండా చూడాలని పేర్కొన్నారు. ఆయా మోడల్ ప్రాథమిక పాఠశాలల పరిధిలోని విద్యార్థుల అడ్మిషన్లు వారంలోగా పూర్తి చేయాలని కమిషనర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కొత్త అడ్మిషన్లు త్వరితగతిన పూర్తి చేస్తేనే వారికి జూలై 5న తల్లికి వందనం సొమ్ము జమ అవుతుందని స్పష్టం చేశారు. వచ్చే నెలా మొదటి వారంలో తల్లిదండ్రులు, టీచర్లు, విద్యార్థుల మెగా సంయుక్త సమావేశాన్ని నిర్వహించనున్నట్లు సర్వశిక్షా అభియాన్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. సమావేశానికి విద్యార్థులు నూతన యూనిఫాంతో హాజరయ్యేలా చూడాలని ఎంఈవోలకు ఆయన ఆదేశాలు జారీ చేశారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఆగిరిపల్లి విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆగిరిపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఆగిరిపల్లి జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ముగ్గురు ప్రహర్ష, రోహిత్, అభిలాష్‌లు ఎంపికయ్యారని హెచ్‌ఎం పుష్పలత తెలిపారు. హెచ్‌సీఎల్ ఈ ఏడాది ఏప్రిల్‌లో గన్నవరం ఎన్టీఆర్ వర్సిటీలో బాలురు అండర్-15 విభాగంలో నిర్వహించిన ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానం సాధించారని, బెంగుళూరులో ఈ నెల 28, 29 తేదీలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం లక్ష్మీ, వ్యాయమ ఉపాధ్యాయులు, శివనాగేంద్ర, సుగుణరావు, విద్యార్థులను అభినందించారు.

పారా చైతన్య యాత్రలో హీల్ విద్యార్థులు

ఆగిరిపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చైతన్య యాత్రలో దివ్యాంగులంతా భాగస్వాములు కావాలని ఆ సంస్థ చైర్మన్ జి. కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన సన్నాహక ర్యాలీలో మండలంలోని తోటపల్లి హీల్ అంధ పాఠశాల తరఫున సెకండరీ స్థాయి విద్యార్థులు వై. లీలా మాధురి, వి. నవీన్, ఆర్. మోక్షజ్ఞ, వై. ఆకాష్, జి. మధు, సీహెచ్. ప్రవీణ్, హరి నరసింహ యాదవ్, రాజు, కోచ్ శ్రీనివాస్‌రెడ్డి, నాంచారమ్మ, హీల్ అంధ పాఠశాల ఇన్‌స్పెక్టర్ ఎస్. రమేష్ తదితరులు పాల్గొన్నట్లు సీఈవో కూరపాటి అజయ్‌కుమార్ తెలిపారు.

యోగాతో ఆరోగ్యం

ముసునూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): యోగాతో ఆరోగ్యకర జీవనం సాగించవ చ్చని ఎంపీపీ కొండా విజయ లక్ష్మి, జనసేన నాయకుడు పాశం నాగబాబు అన్నారు. బుధవారం యోగాంధ్రలో భాగంగా రమణక్క పేట జడ్పీ పాఠశాలలో పీడీ వాకా నాగరాజు ఆధ్వర్యంలో నాయకులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రామకృష్ణారావు మాట్లాడుతూ ప్రతి రోజు యోగాసనాలు వేయడం వల్ల మానసిక ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యంతో జీవనం సాగించవచ్చని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి వెళ్ళాలని జనసేన నాయకుడు నాగబాబు అకాంక్షించారు. ఎస్‌ఎంసీ చైర్మన్ ఎస్.రాజా, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

'తల్లికి వందనం'తో బ్యాంకులు కిటకిట

ముదినేపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం సొమ్మును తీసుకునేందుకు మండలంలోని అన్ని బ్యాంకుల్లో బుధవారం పెద్ద సంఖ్యలో మహిళలు బారులు తీరారు. ఈనెల 12 నుంచి నిత్యం బ్యాంకులు మహిళలతో రద్దీగానే ఉంటున్నాయి. బుధ వారం ఉదయం 9కే ముది నేపల్లిలోని ఎస్‌బీఐ, ఏపీ గ్రామీణాభివృద్ధి బ్యాంకుల వద్ద మహిళలు పెద్ద సంఖ్యలో కనిపించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

సాగు నీరు పారేదెలా.. మురుగు నీరు పోయేదెలా..?

అధ్వానంగా పంట కాల్వలు, డ్రెయిన్లు



మూసుకుపోయిన అన్నవరం బ్రాంచి కెనాల్

ముదినేపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సాగునీరు పొలాలకు చేరటం, పొలాల నుంచి మురుగు నీరు బయటకు పోవటం సాఫీగా సాగేలా కనిపించటం లేదు. ప్రధాన పంట కాల్వల నుంచి బ్రాంచి కాల్వల ద్వారా సాగు భూములకు నీరందటం ఎలా అన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. ముదినేపల్లి మండలంలోని పలు బ్రాంచి పంట కాల్వలు పూడుకుపోవటమే కాక, ముళ్లపొదలు, చెట్లతో మూసుకుపోయాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నా సాగు నీరు పారేందుకు జలవనరుల శాఖ అధికారులు బ్రాంచి పంట కాల్వలను నేటికీ బాగు చేయలేదు. క్యాంప్ బెల్, పోల్ రాజ్ ప్రధాన కాల్వలకు సంబంధించిన బ్రాంచి కాల్వలు గుర్రపు డెక్కతో నిండి ఉన్నాయి. నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడ్డాయి. ఈ పరిస్థితుల్లో శివారు ప్రాంత సాగు భూములకు నీరందటం ప్రశ్నార్థకమే. ఇక మైనర్ డ్రెయిన్ల పరిస్థితి అంతే. పొలాల నుంచి మురుగునీరు మీడియం డ్రెయిన్లకు చేర్చే మైనర్ డ్రెయిన్లలో డెక్క, తూటు కాడ నిండి ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ముంపునకు గురైన పొలాల నుంచి పలు గ్రామాల్లో ఇప్పటికీ నీరు తగ్గలేదు. నారుమళ్లు పోసేందుకు అవకాశం లేకుండా ఉంది. ఈడేపల్లి, వడాలి పొలిమేరకోడు, దేవరం తదితర మైనర్ డ్రెయిన్లలో డెక్క నిండిపోయింది. సార్వా సీజను ప్రారంభమైన ప్రస్తుత పరిస్థితుల్లో బ్రాంచి పంట కాల్వలు, మైనర్ డ్రెయిన్లు అధ్వానంగా ఉండటంతో నీరు అందదు.. ముంపు తప్పదు అన్న ఆందోళన రైతుల్లో నెలకొంది. కాల్వలను బాగు చేయాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.



కనిపించని వడాలి పొలిమేర కోడు డ్రెయిన్

పురుగు మందులు తగ్గించాలి

▸జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా ▸సబ్సిడీ వరి విత్తనాల పంపిణీ



వేమవరప్పాడులో సబ్సిడీపై వరి విత్తనాలు అందజేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా

కైకలూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): వరిసాగులో ఎక్కువ పురుగుమందులు వినియోగించడం వలన పెట్టుబడుల భారం పెరిగి ఆదాయం తగ్గుతుందని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా అన్నారు. బుధవారం కైకలూరు మండలం వేమవరప్పాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ పురుగు మందుల వినియోగం వల్ల భూసారం తగ్గుతుందని అందువల్ల భూసారాన్ని పెంచే విధానాన్ని రైతులు అలవరుచుకోవాలన్నారు. పచ్చిరొట్ట విత్తనాలను, పీఎండీఎస్ కిట్లు రైతులకు అందజేశారు. విత్తనాల్లో మేలైన వంగడాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. అలాగే ప్రతి కౌలు రైతు గుర్తింపు కార్డు తీసుకుంటేనే రుణాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. సబ్సిడీపై వరి విత్తనాలు ఎంటీయు 1318, ఎంటీయూ 7029 రకాల విత్తనాలు అందజేశారు. అలాగే ఎంటీయూ 1443 వరి విత్తనాలు 2 కేజీలు మినీ కిట్లును రైతులకు అందించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బీజామృతంతో వరివిత్తనాలను శుద్ధి చేసుకునే విధానాన్ని చూపించారు. ఏడీఏ ఆర్. గంగాధరరావు, మండల వ్యవసాయాధికారిణి ఆర్. దివ్య, సర్పంచ్ నున్న రాంబాబు, నీటి సంఘాల అధ్యక్షులు బోడావుల వసంతరావు, బీజేపీ మండల అధ్యక్షుడు బోడావుల జగదీష్, వీఏఏ గోపీనాథ్, రైతులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన తప్పనిసరి...

ముదినేపల్లి: రైతులు వ్యవసాయ యాజమాన్య పద్ధతులపై అవగాహన పెంచుకుని వరి అధిక దిగుబడులను సాధించాలని జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ బాషా అన్నారు. మండలంలోని దాకరం, అప్పారావుపేట గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో పాల్గొని ఆయన పలు సూచనలు చేశారు. మేలైన విధానాలను అనుసరించేందుకు రైతులు ఎప్పటికప్పుడు శాస్త్రవేత్తలు, అధికారుల సలహాలు తీసుకోవాలన్నారు. భూసార పరీక్షా ఫలితాలకు అనుగుణంగా ఎరువులు, పురుగు మందులను వినియోగించుకోవాలన్నారు. రైతులకు సబ్సిడీపై సార్వా విత్తనాల కిట్లను పంపిణీ చేశారు. ఏడీఏ జి.వెంకట మణి, ఏవో వేణుమాధవ్, పశువైద్యాధికారి డాక్టర్ క్రాంతి కుమార్, మత్స్య శాఖాధికారి సతీష్, సర్పంచ్ జాస్తి రాజా, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

విత్తన ఎంపికే కీలకం..

కలిదిండి: వరి సాగులో అధిక దిగుబడులు సాధించాలంటే నాణ్యమైన విత్తనాలను రైతులు ఎంపిక చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి విద్యాసాగర్ అన్నారు. బుధవారం కోరుకొల్లులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలను శుద్ధి చేసిన తర్వాతే పొలాల్లో చల్లాలన్నారు. పొలాల్లోని జీలుగ పైరును ట్రాక్టర్లతో దున్నడంతో భూసారం పెరుగుతుందన్నారు. వెదజల్లిన పొలాల్లో కలుపు మొక్కలు రాకుండా చూసుకోవాలన్నారు. వ్యవసాయ అధికారులు మధుబాబు, స్టీఫెన్, రైతులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరి..

చాట్రాయి: సాగులో ఉన్న పచ్చిరొట్టను పూతదశలో కలియదున్నటం వల్ల ఎక్కువ ఉపయోగాలు ఉన్నాయని వ్యవసాయాధికారి శివశంకర్ అన్నారు. నరసింహారావుపాలెంలో బుధవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు ఖచ్చితంగా డీలర్ నుంచి బిల్లు తీసుకోవాలన్నారు. విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. వరి నారుమళ్ళకు యూరియా 1 కేజీ, భాస్వరం 1 కేజీ, పొటాష్ 1 కేజీ తప్పనిసరిగా వాడాలని, గుళికలు 1 కేజీ వేయటం ద్వారా పురుగుల ఉధృతి నుంచి నారుమడిని కాపాడుకోవచ్చునని అన్నారు. టీడీపీ నాయకులు నోబుల్‌రెడ్డి, కట్టా దుర్గారావు, రైతులు పాల్గొన్నారు.



కాట్రేనిపాడులో పాఠ్య పుస్తకాల పంపిణీ



ఈదరలో పంపిణీ..



పెయ్యేరు ప్రాథమిక పాఠశాలలో..

విద్యారంగం బలోపేతానికి కృషి

ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో టీడీపీ నాయకులు

ముసునూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): విద్యారంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని సీనియర్ టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ బొమ్మగంటి శ్యామలరావు అన్నారు. బుధవారం కాట్రేనిపాడు జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, విద్యా సామగ్రిని నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా పదో తరగతిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థిని పేరిచర్ల సింధుకు రూ. 10 వేలు నగదును శ్యామలరావు, ద్వితీయ స్థానం సాధించిన కుప్పాల వెంకట ముసలికి రూ. 5 వేలు డీసీ చైర్మన్ రాపర్ల బాలకృష్ణ, తృతీయస్థానం సాధించిన విద్యార్థిని పేరిచర్ల స్వాతికి సూర్యదేవర శ్రీనివాసరావు 3 వేలు నగదు ప్రోత్సాహక బహుమతిగా అందజేశారు. ప్రతి ఏటా టెన్త్‌లో ప్రథమ స్థానం సాధించే విద్యార్థికి రూ. 10వేలు ఇచ్చేలా శ్యామలరావు రూ.1,50,000 నగదును స్కూల్ అకౌంట్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినట్లు హెచ్‌ఎం కుంభం కుసుమకుమారి తెలిపారు. దాతలను ఉపాధ్యాయులు సన్మానించారు. ఎస్‌ఎంసీ చైర్మన్ ఏసుబాబు, నాయకులు గద్దల మోహన్‌రావు, పిన్నిబోయిన మంగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: ఈదర జడ్పీ హైస్కూలు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశామని హెచ్‌ఎం శారద తెలిపారు. మండల టీడీపీ అధ్యక్షుడు నక్కబోయిన వేణు, సర్పంచ్ దొండపాటి ఏసుపాదం, అనిత, చిన్న, వెంకటేశ్వరరావు, విద్యా కమిటీ చైర్మన్ అంజయ్య, కోటగిరి మోహన్, అయ్యంకి సురేష్‌బాబు, ఈదర టీడీపీ నాయకులు గరిసేపల్లి శ్రీను చేతుల మీదుగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేశామని తెలిపారు. అనంతరం 10వ తరగతి పూర్తయిన పేద విద్యార్థులు నర్సింగ్ కళాశాలలో విద్యాభ్యాసం కోసం మండల టీడీపీ అధ్యక్షుడు నక్కనబోయిన వేణు, కోటగిరి మోహన్, దొండపాటి ఏసుపాదం, సర్పంచ్ దొండపాటి అనిత ఒక్కక్కరు పదివేల చొప్పున రూ. 40 వేలు విద్యార్థుల తల్లితండ్రులకు అందించనున్నట్లు సర్పంచ్ అనిత తెలియజేశారు.

ముదినేపల్లి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీని విద్యాశాఖ చేపట్టింది. మండలంలో 3362 మంది విద్యార్థులకు ఈ కిట్లు పంపిణీ చేస్తున్నట్లు ఎంఈవో నరేష్ కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని పలు పాఠశాలల్లో కూటమి నాయకులు ఉపాధ్యాయులు, విద్యార్థులకు కిట్లను అందజేశారు. పెయ్యేరు ప్రాథమిక పాఠశాలలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి బేతాళ రాజేంద్ర ప్రసాద్, ఉపాధ్యాయుడు చక్రధర్, ఎస్‌ఎంసీ చైర్మన్ షేక్ మున్నీసా కిట్లను పంపిణీ చేశారు.

చాట్రాయి: మండలంలోని సి. గుడిపాడు జడ్పీ హైస్కూల్, పోలవరం కోనేరు పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్య, నోటు పుస్తకాలను టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి సర్కార్ విద్యకు అధిక ప్రాధాన్యమిస్తోందని, అర్హులైన ఉపాధ్యాయులతో విద్యాబోధనతో పాటు ఉచిత పాఠ్య పుస్తకాలు, స్కూల్ బ్యాగ్స్, యూనిఫామ్, పోషక విలువలున్న మధ్యాహ్న భోజనం అందిస్తున్నదని, తల్లి దండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపి సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టీడీపీ నాయకులు పుచ్చకాయల నోబుల్‌రెడ్డి, మరిడి చిట్టిబాబు, తల్లాడ శ్రీనివాసరావు, కట్టా నాగ దుర్గారావు, ఎస్‌ఎంసీ చైర్మన్ నాగరాజు, హెచ్‌ఎంలు ఆర్ నాగేశ్వరరావు, బక్కయ్య పాల్గొన్నారు.



సి. గుడిపాడు జడ్పీ హైస్కూల్‌లో..

కొల్లేరు కాలుష్యంపై మీరేం చేశారు?

(ఐదో పేజీ తరువాయి)

మరమ్మతులకు రూ.3 కోట్లు మంజూరు చేస్తే, అభయారణ్య పరిధిలోకి వస్తుందని పనులే చేపట్టని విషయాన్ని ఆయన కమిటీ దృష్టికి తీసుకువెళ్లారు. వన్యప్రాణి అభయారణ్యం అభివృద్ధికి ఏ చర్యలు తీసుకోలేదని, కొల్లేరు ఆపరేషన్‌లో భూములు కోల్పోయిన వారికి న్యాయం చేయాలని ఆయన కోరారు.

కమిటీ తిరుగు ప్రయాణం

జిల్లాలో రెండు రోజులపాటు పర్యటించిన కేంద్ర సాధికార కమిటీ బృందం అన్ని అంశాలను సాధ్యమైనంత మేర స్పృశించే ప్రయత్నం చేసింది. రెండో రోజు బుధవారం జరిగిన సమీక్షలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, అటవీ శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంతరాము, కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ అజయ్‌కుమార్ నాయక్, ఎస్పీ కిశోర్, డీఎఫ్‌వోలు శుభం, విజయ, ఆర్డీవో అంబరీశ్ పాల్గొన్నా రు. సాధికార కమిటీ సభ్యులను సాగ నంపుతూ వారందరిని కలెక్టర్ సత్కరించారు.

సూర్యఘర్ లక్ష్యాలు సాధించాలి

ముసునూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి సూర్య ఘర్ లక్ష్యాలను సాధించేలా అధికారులు నిబద్ధతతో పనిచేయాలని ఎంపీపీ కొండా విజయలక్ష్మి అన్నారు. బుధవారం మండల కార్యాలయంలో సూర్య ఘర్, యోగా డేపై మండల స్థాయి సమావేశాన్ని నిర్వహించి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సూర్య ఘర్ విద్యుత్ సర్వీసులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ పథకం అన్ని వర్గాల వారికి వర్తిస్తుం దన్నారు. ఈ నెల 21న యోగా డే సందర్భంగా ప్రతి గ్రామ సచివాల యం పరిధిలో విద్యార్థులు, మహిళలు, ఇతర ప్రభుత్వ సిబ్బంది, ప్రజాప్రతినిధులు యోగాలో పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు.

స్థలాల అర్జీలపై సబ్ కలెక్టర్ విచారణ

ముసునూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల స్థలాల కోసం వచ్చిన అర్జీలపై క్షేత్రస్థాయిలో నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ బుధవారం విచారణ జరిపారు. ముసునూరు ఎస్సీ కాలనీకి చెందిన 29 మంది ఇళ్ల స్థలాల కోసం అర్జీలు పెట్టుకోగా వీఆర్వో మణీంద్రరావు విచారణలో 21 మంది అర్హులుగా గుర్తించారు. చెక్కపల్లిలో 40 మంది అర్జీలు ఇవ్వగా వీఆర్వో యశోద విచారణలో నలుగురిని అర్హులుగా గుర్తించారు. మిగిలిన వారికి గతంలోనే జగన్న కాలనీలో పట్టాలు ఇచ్చినట్టు గుర్తించారు. అర్హుల జాబితాపై సబ్ కలెక్టర్ విచారణ చేశారు. అర్జీదారుల నివాస గృహాలను, పరిశీలించి వారితో మాట్లాడారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలించారు.

జగన్ రీ సర్వే మాయాజాలం!

(ఐదో పేజీ తరువాయి)

ఇద్దరు పిల్లలు ఉండి అర్హత ఉన్నప్పటికీ తల్లికి వందనం అనర్హుల జాబితాలోనే మిగిలిపోయారు.

పెయ్యేరులో శాంతి అనే మహిళ పేరున విద్యుత్ మీట రు లేకపోయినా ఆ కుటుంబం సగటును 300 యూనిట్ల విద్యుత్‌ను వినియోగిస్తున్నట్టు ఆన్‌లైన్‌లో చూపించి తల్లికి వందనం జాబితాలో అనర్హురాలిగా పేర్కొన్నారు. ఆమె బుధవారం ఆ పాఠశాలకు వచ్చి హెచ్‌ఎంను కలిసి తనకు తల్లికి వందనం సొమ్ము బ్యాంకు ఖాతాలో జమ కాలేదని చెప్పగా దీనిపై ఆరాతీస్తే విద్యుత్ వినియోగం ఎక్కువ ఉన్నట్లు తప్పుగా నమోదైనట్టు తెలిసింది.

'వడ్డీ రాయితీ తక్షణం విడుదల చేయాలి'

నూజివీడు టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): బ్యాంకుల్లో, సహకార సంఘాల్లో పంట రుణాలకు ఇవ్వవలసిన నాలుగు శాతం వడ్డీ రాయితీని తక్షణం విడుదల చేయాలని రైతు సంఘం సీనియర్ నాయకుడు కొమ్మన నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం నూజివీడులో ఆయన మాట్లాడుతూ కేంద్రం ఇస్తున్న 3% రాయితీ రైతులకు విడుదల చేసినా పీఏసీఎస్‌లో నేటికి రైతులకు ఇవ్వలేదని, రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన 4% నేటికీ విడుదల చేయలేదని, ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయినా వడ్డీ రాయితీ విడుదల చేయకపోవడం శోచనీయమన్నారు.



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

ముసునూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకం ద్వారా ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేస్తోందని టీడీపీ నాయకుడు పాలడుగు నాగేంద్రబాబు అన్నారు. బుధవారం రాత్రి చింతలవల్లి మెయిన్ సెంటర్‌లో విద్యార్థుల తల్లులు, నాయకులు సంయుక్తంగా సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. నాయకులు ఏనుగుదాటి రాజు, పాలడుగు ప్రశాంత్, కాటేపల్లి నాని పాల్గొన్నారు.



తల్లి ఆనందం..

కైకలూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ముగ్గురు పిల్లలున్నప్పటికీ గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్కరికి మాత్రమే అమ్మ ఒడి పథకం అందజేయగా కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన తల్లికి వందనంతో ఒకే కటుంబంలోని ముగ్గురు ఆడపిల్లలకు వారి తల్లి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అయింది. కైకలూరు ఎంపీ యూపీ ఉర్దూ పాఠశాలలో చదువుతున్న ఒకే కుటుంబానికి చెందిన 5వ తరగతి విద్యార్థిని షేక్ ఫర్హానాకు, ప్రభుత్వ ఉనత్న పాఠశాలలో పదో తరగతి చదువుతున్న షేక్ అజీజున్నీసా, 8వ తరగతి చదువుతున్న షేక్ రబీయా ముగ్గురికి వారి తల్లి రెహమతున్నీసా ఖాతాలో నగదు జమ అయింది. దీంతో వారి తల్లిదండ్రులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. భర్త కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారని ప్రభుత్వం అందించిన సొమ్ము పిల్లల విద్యాభివృద్ధికి కేటాయిస్తామన్నారు.



ముమ్మరంగా తూడు తొలగింపు

కలిదిండి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కాల్వలకు సాగు నీరు విడుదల చేయటంతో నీటి సంఘం అధ్యక్షుడు మంతెన సుబ్బరాజు ఆధ్వర్యంలో బుధవారం గుర్వాయిపాలెం నుంచి భాస్కరరావు పేట వరకు సుమారు 7 కిలోమీటర్ల మేర కాల్వలో దట్టంగా పేరుకుపోయిన డెక్క, తూడును తొలగించారు. సాగు, తాగునీటి సరఫరాకు ఆటంకం లేకుండా గుర్వాయిపాలెం, పెదలంక కాల్వలో డెక్క, తూడును పూర్తిగా తొలగించటానికి చర్యలు తీసుకుంటున్నామని ఇరిగేషన్ ఏఈఈ ఫణి కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మోటారు సైక్లిస్టు దుర్మరణం

పెదవేగి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఎదురుగా వచ్చిన లారీ ఢీ కొట్టడంతో ద్విచక్రవాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ముసునూరు మండలం చెక్కపల్లికి చెందిన సికాకొల్లు వెంకట నాగేశ్ ద్విచక్ర వాహనంపై బుధవారం సాయంత్రం ఏలూరు వెళ్తుండగా చింతలపూడి నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయమైన వెంకట నాగేశ్ (50) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు.

నమ్మించి మోసగించాడని ఫిర్యాదు

నూజివీడు టౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి తనను నమ్మించి మోసగించాడంటూ నూజివీడు పట్టణానికి చెందిన మహిళ పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలు కొర్ర సోని నూజివీడుకు చెందిన ఎలికె సురేంద్రకు నాలుగేళ్లక్రితం సోషల్ మీడియా ద్వారా పరిచయం ఏర్పడింది. పెళ్లికి పెద్దలను ఒప్పించాలని కోరడంతో తన అమ్మమ్మ వద్దకు వెళ్లి ఉద్యోగం వచ్చిన తరువాత పెళ్లి చేసుకుంటానని హామీ ఇచ్చాడని సోని తెలిపింది. అయితే 2023 అక్టోబరు 10న హైద్రాబాద్‌లో ఉంగరాలు మార్చుకుని ఇదే నిశ్చితార్థం, వివాహమంటూ తనను నమ్మించి మోసం చేశాడని, ఇంట్లో వారిని ఒప్పించి తీసుకెళ్తానని ఆరు నెలల క్రితం నూజివీడు వచ్చి చివరికి ముఖం చాటేశాడంటూ బాధితురాలు వాపోయింది. ఇదే విషయం పెద్దల ముందు పెట్టగా ఉద్యోగం రాలేదని, ఇంట్లోని పెద్దలు ఒప్పుకోవడం లేదంటూ సాకులు చెబుతున్నాడని, మోసపోయానని గ్రహించి ఆత్మహత్యాయత్నం కూడా చేశానంటూ సోనీ పేర్కొంది. తనను వదిలించుకోవాలనే ఉద్దేశంతో బెదిరింపులకు దిగాడని, న్యాయం చేయాలంటూ బాధితురాలు నూజివీడు పట్టణ పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసి పట్టణ పోలీసులు విచారణ చేపట్టారు.

మహిళపై దాడి

ముదినేపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వైవాకలో ఒక మహిళపై ముగ్గురు వ్యక్తులు దాడిచేసి తీవ్ర గాయాలకు గురి చేశారు. ఈ నెల 9న ఆ గ్రామానికి చెందిన గడిదేశి పేరమ్మ అనే మహిళ స్థలం నుంచి పక్కనే ఉన్న శ్రీనివాసరావు ఇంటి స్థలంలోకి మురుగునీరు వస్తున్న విషయంపై ఇరువురి మధ్య వివాదం ఏర్పడింది. శ్రీనివాసరావు, అతని కుటుంబ సభ్యులు కలిసి పేరమ్మను కర్రలతో కొట్టి గాయపరిచారు. ఆమెను గుడివాడ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించిన అనంతరం పెద్దలు చేసిన రాజీ యత్నాలు ఫలించకపోవడంతో పేరమ్మ కుమారుడు యోబు బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.